జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | ఆదివారం 21 జూన్ 2026 | సంపుటి : 16 | సంచిక : 329 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, ప్రత్యేక దినాలు : పితృ దినోత్సవం, ప్రపంచ సంగీత దినోత్సవం, ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవం, సూర్యోదయం : 5:27 సూర్యాస్తమయం : 6:31, చంద్రోదయం : 11:26 । చంద్రాస్తమయం : 11:54 పంచాంగం : తిథి : శుద్ధ సప్తమి రా. 7:59 వరకు, తర్వాత అష్టమి, నక్షత్రంలి: పుబ్బ మ. 2:34 వరకు, తర్వాత ఉత్తర, యోగం : సిద్ధి సా. 4:35 వరకు, తర్వాత వ్యతీపాత, కరణం : గరజి ఉ. 8:28 వరకు, తర్వాత వణిజ రా. 7:59 వరకు, తర్వాత భద్ర

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail : prajajyothidaily@gmail.com

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భట్టి హామీ

**అల్వాల్, జూన్ 20: ప్రజా జ్యోతి**

వెంకటాపురం డివిజన్ నెలకొన్న విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా పలు ప్రాంతాల్లో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, సింగిల్ ఫేజ్ కనెక్షన్లను త్రీ ఫేజ్‌గా మార్పిడి చేయడం, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అలాగే వెంకటాపురం డివిజన్‌లోని యాదమ్మనగర్ ప్రాంతంలో నివసిస్తున్న పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల ప్రజలకు బల్క్ మీటర్ మంజూరు చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమస్య పరిష్కారమైతే స్థానిక ప్రజలకు విద్యుత్ సౌకర్యాల విషయంలో గణనీయమైన ఉపశమనం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే సమర్పించిన వినతిపత్రాలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవల అందుబాటుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.



# బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శం!

కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైంది

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి

రైతు భరోసా అమలులో స్పష్టత లేదు

సర్పంచ్ ఇచ్చిన వినతి పత్రాన్ని పక్కన పెట్టడం...

పాత భవనానికి రంగులు అద్దిన ఘనత కాంగ్రెసుది

విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి




**ఇబ్రహీంపట్నం జూన్ 20 ప్రజాజ్యోతి:**

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానుకొని, పాలనపై దృష్టి సారించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల -

## 22వ తేదీ నుంచి హైడ్రా ప్రజావాణి యథాతథం

వర్షాకాలం సమస్యలకు ప్రాధన్యం

ప్రభుత్వ భూములు, వరద కాలువలు, చెరువులు, పార్కుల కబ్జాపై ఫిర్యాదు చేయవచ్చు

---హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్

**రాజేంద్రనగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి)**

హైడ్రా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ నుంచి యథాతథంగా కొనసిగిస్తున్నట్టు హైడ్రా శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వర్షాకాలాన్ని దృష్టి పెట్టుకుని.. ఎదురయ్యే సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పింది. నగరంలో వర్షాకాలం ఎదురయ్యే సమస్యలు, నీట మునిగే ప్రాంతాలు, అందుకు గల కారణాలను ఫిర్యాదులో వివరంగా పేర్కొనాలని సూచించింది. వాటి పరిష్కారానికి హైడ్రా అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపింది. వరద కాలువలు, చెరువుల కబ్జాలతో పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమణలు ఏవైనా ఉంటే హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. వరదలకు గల కారణాలను వివరించడంతో పాటు... ఎప్పటి నుంచి ఆ సమస్య ఉందో తెలపాలని సూచించింది.

## మచ్చ బొల్లారంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం

**అల్వాల్ జూన్ :20 ప్రజా జ్యోతి**

అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారంలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పనుల ప్రాంతాన్ని సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆర్‌యూబీ పనులు ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గి, రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డొల్లి రమేష్, పరమేష్, శరణ్ గిరి, పవన్, సాజిద్, భాస్కర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. మాచబొల్లారం ప్రాంత అభివృద్ధిలో ఈ ఆర్‌యూబీ నిర్మాణం కీలక మైలురాయిగా నిలవనుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





## ఉప్పల్ మినీ శిల్పారామం లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించిన కూచిపూడి నృత్యం



**ఉప్పల్,జూన్ 20,(ప్రజా జ్యోతి):**

ఉప్పల్ మినీ శిల్పారామం లో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి నాట్య గురువు శ్రీలక్ష్మి శాంకరి శిష్య బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన ఆధ్యంతం అలరించింది. గణేశా పంచరత్న,. బొమ్మ బొమ్మ, కృష్ణ శబ్దం, సమ్మోహన, గణాధ్యక్షా, త్రిలయ , ఉషోదయ, పంచాక్షరీ, అలరులు కురియగా, ఒకపరి కొకపరి మొదలైన అంశాలను కళాకారులూ సాయి అనఘా, మనస్విని, శ్రీజ, అనన్య, సహస్ర, నందన, పర్ణిక, శ్రీనిక, అద్విత, శ్లోక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. ప్రముఖ నాట్య గురువు పద్మ కళ్యాణ్ , డాక్టర్ జ్యోతి శేఖర్ ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



## రైతులకు పంట బీమా సాకారం చేయాలని వినతి



**షాద్ నగర్,జూన్ 20(ప్రజాజ్యోతి):**

రైతులకు పంట బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్యక్షతన శనివారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వడగళ్ల వానల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (గ్రావీఖీదీ) తరహాలో రాష్ట్ర రైతులకు కూడా పంట బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాజీపల్లి గ్రామ డిప్యూటీ సర్పంచ్ గంగాధర్ , శ్రీనివాస్ చారి, సీనియర్ బీజేపీ నాయకులు బాల్ రెడ్డి , భాస్కర్ పటేల్ , కృష్ణ యాదవ్ , ప్రభాకర్ , గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యోగ గురువు యువి నాగలక్ష్మికి 'యోగ రత్న అవార్డు-26'

**హైదరాబాద్, జూన్ 20 (ప్రజా జ్యోతి):**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రముఖ యోగా గురువు, జాయ్ ఆఫ్ యోగ డైరెక్టర్ యువి నాగలక్ష్మికి యోగ రత్న అవార్డు-2026 ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ ఏడాది ఈ అవార్డుకు ఎంపికైన ఏకైక వ్యక్తిగా ఆమె నిలిచారు. జూన్ 21న మౌలాలిలోని ఆర్‌పీఎస్‌ఎఫ్ 7వ బెటాలియన్లో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, టీసీసీ సికింద్రాబాద్ అధ్యక్షుడు రహదారి రామ్మోహన్ తెలిపారు. గత 25 ఏళ్లుగా యోగా సేవలు అందిస్తున్న యువి నాగలక్ష్మి, దేశ విదేశాల్లో యోగా ప్రచారంతో పాటు మహిళా హక్కులు, జాతీయ సమైక్యత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నారు.



# జడ్పీహెచ్ఎస్ పగిడ్యాల్ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మహిపాల్ రెడ్డి






**యాలాల్ (జూన్ 20) ప్రజా జ్యోతి** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యాలాల్ మండలం లోని జడ్పీహెచ్ఎస్ పగిడ్యాల్ పాఠశాలలో శనివారం ఘనంగా యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెంగళూరులోని వివేకానంద యోగా సెంటర్‌కు చెందిన యోగా శిక్షకులు వాసిరెడ్డి శ్రీనుబాబు విద్యార్థులకు యోగ ప్రాముఖ్యత,ఆరోగ్య ప్రయోజనాలు,మానసిక ప్రశాంతతకు యోగ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా యాలాల్ మండల విద్యాశాఖ అధికారి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, యోగ విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు మానసిక ప్రశాంతత,శారీరక దృఢత్వాన్ని కలిగిస్తుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య మాట్లాడుతూ, భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి (యూఎన్ఓ) ప్రతి సంవత్సరం జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా నిర్వహించేందుకు ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. యోగను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పగిడ్యాల్ సర్పంచ్ రిషిత,ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,ఏఏపీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ,అశోక్ రెడ్డి, తుప్పలి రాములు, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, ఉన్నత ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం యోగా గురువు శ్రీ వాసిరెడ్డి శ్రీనుబాబును పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# వనమహోత్సవం-2026ను ఉద్యమంలా నిర్వహించాలి

**వికారాబాద్ ప్రతినిధి, జూన్ 20(ప్రజా జ్యోతి):** వనమహోత్సవం--2026 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, ప్రభుత్వం నిర్దేశించిన మొక్కల నాటకం, సంరక్షణ లక్ష్యాలను వందకు వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, హరిత విస్తీర్ణం పెంపు, భూగర్భ జలాల సంరక్షణకు మొక్కల పెంపకం కీలకమని పేర్కొన్నారు. ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అటవీ శాఖతో సమన్వయం చేసుకుని మొక్కల సరఫరా, నాటడం, సంరక్షణ చర్యలను పక్కాగా అమలు చేయాలని, నాటిన మొక్కల మనుగడపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కేవలం నాటడం కాకుండా కంచెల ఏర్పాటు, నీటి వసతి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, మున్సిపల్, విద్య, వ్యవసాయం, ఉద్యానవన, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు తమ పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజా భాగస్వామ్యంతో వనమహోత్సవాన్ని ఉద్యమంలా నిర్వహించి, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని,



రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు మెను ప్రకారం ఆహారం అందించడంపై అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఉమా శంకర ప్రసాద్, వెంకట చారి, డిఆర్డిఏ శ్రీనివాస్, డిఆర్ఓ స్వర్ణలత, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రామంతాపూర్ గోశాల అక్రమాలపై విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు

## ప్రధాన కార్యదర్శి తాళ్ల బాలకృష్ణ గౌడ్





**ఉప్పల్,జూన్ 20,(ప్రజాజ్యోతి):** రామంతాపూర్ చిన్న చెరువు పరిధిలోని పాండురంగ సేవ సమితి గోశాల లో జరుగుతున్న అక్రమాలు, అవకతవకల పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ సమితి ప్రధాన కార్యదర్శి తాళ్ళ బాలకృష్ణ గౌడ్ ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత 2011 వ సంవత్సరం లో ఏర్పాటు చేసిన గోశాల లో ఆవులు, ఎద్దులు కలిపి మొత్తం 48 ఉండగా, వేముల వెంకట్ రెడ్డి అనే వ్యక్తి నాలుగు, దీపక్ కంజారియా మూడు, ప్రవీణ్, మురళీ లు రెండేసి చొప్పున మొత్తం 11 ఎద్దులను ఎవరి అనుమతి లేకుండా అక్రమంగా తరలించుకు పోవడం జరిగిందని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. అదే విధంగా గోశాల కు చెందిన ఆర్థిక లావాదేవీలు, సీసీ కెమెరాల డి వి ఆర్ విషయంలో సైతం ప్రదీప్ కుమార్, మహేందర్, సంతోష్, అంజి యాదవ్, నరేందర్ అనే వ్యక్తుల ప్రోత్సాహం తో అవకతవకలకు పాల్పడుతున్నారని, ఇట్టి విషయంలో పోలీస్ అధికారులు తగు చర్యలు చేపట్టి గోవులను రక్షించి దోషులను చట్టపరంగా శిక్షించాలని బాలకృష్ణ గౌడ్ ఫిర్యాదు లో కోరారు.




# అగ్గనూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాసం

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య.



**యాలాల :(జూన్ 20) ప్రజా జ్యోతి** మండలం పరిధిలోని అగ్గనూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్గనూర్ గ్రామసర్పంచ్ మంజులభీమప్ప ఉప సర్పంచ్ ఉప్పరి వెంకటయ్య ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులకు అక్షరాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి చిన్నారి భవిష్యత్తుకు బలమైన పునాది అని,అక్షరాభ్యాసంతో విద్యా ప్రయాణం ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అక్షరాభ్యాసం ద్వారా విద్యార్థుల్లో నేర్చుకునే ఉత్సాహం మరింత పెరుగుతుందని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరాలు దిద్దించి, చదువు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తప్పులులేకుండా ఓటర్ జాబితా రూపొందించాలి..

తహశీల్దార్ సాహిదాబేగం






**బషీరాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ బాలురు ఉన్నత పాఠశాలలో శనివారం బూతు స్థాయి అధికారులకు (పీఎల్ఓలు) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షాహిదాబేగం, మండల విద్యాధికారి దూస రాములు, ఉప తశీల్దార్ రుక్సానాబేగం పాల్గొన్నారు. ఈ సందర్భంలో విద్యాధికారి దూస రాములు మాట్లాడుతూ ఈనెల 25వ తారీకు నుండి వచ్చేనెల24 వరకు ఇంటింటి ఓటరగణన పకడ్బందీగాచేయాలని సూచించారుఈ సందర్భంగా తహశీల్దార్ షాహిదాబేగం మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బిఎల్వోలు బాధ్యతలు పనిచేయాలని సూచించారు అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటర్ జాబితాలో నమోదు చేయడంతో పాటు మరణించిన వారు ఇతర ప్రాంతాలకు మారిన వారు వివరాలు సక్రమంగా పరిశీలించి జాబితాను సమీకరించాలని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యం వ్యవస్థకు పునాది అని ప్రతి ఇంటిని సందర్శించి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని ఆమె సూచించారు. ఓటరు నమోదు మార్పులు తొలగింపులు ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పక పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ వోలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన బ్యాంకు మేనేజర్ కు ఘనంగా సన్మానం

సొసైటీ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి





**బషీరాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి :** బషీరాబాద్ లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ బదిలీపై మహబూబ్ నగర్ శాఖకు వెళ్తున్న సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి శాలువతో మురళీకృష్ణ సత్కరించి జ్ఞాపకాన్ని అందజేశారు. బషీరాబాద్ లో విధులు నిర్వహించిన కాలంలో మురళి కృష్ణ రైతులకు ఖాతాదారులకు అందించిన సేవలు ప్రశంసనీయామానీ కొనియాడారు. ఈ సందర్భంలో హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధికి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మురళీకృష్ణ విశేష కృషి చేశారు. ఆయన కొత్త బాధ్యతలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూన్నాం అని అన్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ బషీరాబాద్ ప్రజలు ఖాతాదారులు సిబ్బంది తనకు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. కొత్త ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా సేవలందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ తేజ, క్యాషియర్ నర్సిరెడ్డి, బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా

# అందరూ ఎదగాలన్నదే జై భవాని పొదుపు సంఘం ఆకాంక్ష

అభ్యుదయ సమైక్య సంఘం అధ్యక్షుడు బండ నర్సింహ
సహకార స్ఫూర్తితో కొనసాగుదాం
473 మంది సభ్యులతో రూ.కోటి 27 లక్షల టర్నోవర్
ఘనంగా 18వ వార్షికోత్సవం



**కొత్తూర్ జూన్ 20 (ప్రజా జ్యోతి)** సంఘ సభ్యులందరూ ఎదగాలన్నదే జైభవాని పొదుపు సంఘం యొక్క ఆకాంక్ష అని అభ్యుదయ సమైక్య పాలమాకుల అధ్యక్షుడు బండ నర్సింహ అన్నారు. కొత్తూరులో జై భవాని పొదుపు సంఘం స్థాపించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పొదుపు సంఘం అధ్యక్షురాలు సరగడ రోహిణి ఆధ్వర్యంలో కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలోని పొదుపు సంఘం కార్యాలయం వద్ద 18వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అభ్యుదయ సమైక్య పాలమాకుల అధ్యక్షుడు బండ నర్సింహ, ఉపాధ్యక్షుడు మైపాల్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు కె.నర్సింహ, చెన్నయ్య, సీఈఓ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని పొదుపు సంఘం కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జై భవాని పొదుపు సంఘం చిన్నది, 473 మంది సభ్యులు తక్కువే అయినప్పటికీ టర్నోవర్ లో మాత్రం రూ.కోటి 27 లక్షలను చేసి మిగతా పొదుపు సంఘాలను దాటివేసిందన్నారు. గత 18 సంవత్సరాలుగా పొదుపు సంఘానికి సేవలను అందచేస్తున్న కమిటీ సభ్యులకు, సంఘం వ్యవస్థాపకులు జాండగూడెం మంజూల సత్యనారాయణను శాలువాతో సత్కరించి అభినందించారు. సంఘం సభ్యులందరికీ పొదుపు సంఘం సహాయ, సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. సహకార సంఘం సహకారాన్ని పొంది ఆర్థికంగా ఎదగాలని, తీసుకున్న అప్పులను, వడ్డీని సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. గ్రూపు సభ్యులకు ఏదైనా ఆపత్కాల సమయంలో ఆదుకునేందుకు మూడు రకాల ఇన్స్యూరెన్స్ లు, రుణాలు, పిల్లల పెళ్లిళ్ల కోసం కళ్యాణ పథకం సైతం అందుబాటులో ఉన్నాయన్నారు.

**జై భవాని పొదుపు సంఘం నూతన కమిటీ ఎన్నిక**

కొత్తూరు జై భవాని పొదుపు సంఘం నూతన పాలకవర్గాన్ని అభ్యుదయ సమైక్య అధ్యక్షుడు బండ నర్సింహ సమక్షంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా జాండగూడెం మంజూల, కార్యదర్శిగా సరగడ రోహిణి, కోశాధికారిగా జాండగూడెం ఉమను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాత, కొత్త కమిటీ సభ్యులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇంటర్నేషనల్ యోగ డే వేడుకలు

## దేశ యువత సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసనాలు అత్యంత అవసరం: డాక్టర్ జి. నరేందర్ రెడ్డి





**అల్వాల్,జూన్ 20.(ప్రజా జ్యోతి):** దేశ యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే నిత్యం యోగాసనాలు చేయడం అత్యంత అవసరమని జీఎన్ఆర్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి. నరేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీఎన్ఆర్ హాస్పిటల్‌లో ఇప్పుక లాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలలో యోగా ఒక అవిభాజ్య భాగమని పేర్కొన్నారు. మన దేశానికి చెందిన యోగాను ప్రపంచ దేశాలకు పరిచయం చేయడం గర్వకారణమని, నేడు ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ప్రతి భారతీయుడికి ఆనందాన్ని కలిగించే విషయమని అన్నారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి యోగా ఎంతో ఉపయుక్తమని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో యువత ఎదుర్కొంటున్న ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు యోగా అద్భుత సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఇప్పుక లాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో యోగ మాస్టర్ జి ఆర్ నారాయణ నిర్వహించిన యోగా కార్యక్రమా హాస్పిటల్స్ డాక్టర్ స్ తదితరులు పాల్గొన్నారు. యోగ అనంతరం యోగాలో పాల్గొన్న వారికి యోగ యోగా మ్యాట తో పాటు ఫ్రూట్స్ బాక్స్ గ్లూకోజ్ బాటిల్ పంపిణీ చేశారు.

# ఆరోగ్యవంతమైన జీవనానికి యోగమే మార్గం






హస్మత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
ప్రతిరోజూ యోగ, ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి : ఏనుగుల తిరుపతి

**బోయిన్ పల్లి, జూన్ 20.(ప్రజా జ్యోతి):** భారతీయ ఋషుల అమూల్య కానుకైన యోగ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని, నిత్య జీవితంలో యోగ, ధ్యానాలను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయినపల్లి డివిజన్ హస్మత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ప్రపంచానికి అందించిన యోగ నేడు విశ్వవ్యాప్త గుర్తింపు పొందడం ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని అన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని అధిగమిం చేం దుకు యోగ ఉత్తమ ఔషధంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాభ్యాసం, ధ్యానాన్ని భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం సభ్యులు బాబురావు, రాంకిషన్ జీ, బాలరాజ్, యోగానంద రాజు, ఇతర స్వయంసేవక్ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం విజయవంతం

ఎన్నికల తేదీని ప్రకటిస్తామన్న మిత్ర హిల్ వెల్ఫేర్ అసోసియేషన్



**కూకట్ పల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి) :** శేర్లింగంపల్లి నియోజకవర్గం, హైదర్ నగర్ డివిజన్ మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ నంబర్ 2140/2006)ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సాధారణ సభ్యుల సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు, సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన కాలనీ సభ్యులందరికీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ ఎన్నికలను నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని సభ్యులు సూచించారు. ఎన్నికల తేదీ, ఎన్నికల ప్రక్రియ, నామినేషన్లు, ఇతర పూర్తి వివరాలను తదుపరి 24 గంటలలో ప్రకటిస్తామని మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం వెల్లడించింది. కాలనీ అభివృద్ధి కోసం సభ్యులందరూ ఇదే విధంగా సహకరించాలని కార్యవర్గం కోరింది.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**బషీరాబాద్ జూన్ 20 ప్రజా జ్యోతి** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ట్రాక్టర్ పట్టివేతఎస్ఐవిఠల్ తెలిపిన వివరాలు ప్రకారం మంతట్టివాగు నుండి మంతట్టి గ్రామానికీ అక్రమంగాఎలాంటి అనుమతిపత్రాలు లేకుండ ఈసుక తరలిస్తున్న డ్రైవర్ బోయిని వేంకటప్ప తండ్రి నర్సిములు మంతట్టి గ్రామం ట్రాక్టర్ ఇంజన్ నంబర్ టీఎస్ 34 బీ 0154 ట్రాలీ నంబర్ ఏపీ28టి5329 గల ధనిని స్వాదీన పర్చుకొని కేసు నమోదు చేసిన బషీరాబాద్ ఎస్ఐ విఠల్ తెలిపారు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్నారు

# డ్వాక్రా భవన నిర్మాణానికి మార్కింగ్

-మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది
-గ్రామ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి



**తాండూరు జూన్ 20 ప్రజా జ్యోతి :-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ప్రత్యేక నిధులు కేటాయించడంతోపాటు భవన నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని చంద్రవంచ గ్రామ సర్పంచు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రోజు గ్రామంలోని ఊరడమ్మ గుడి వద్ద రూ 10 లక్షలతో చేపట్టే డ్వాక్రా భవనం నిర్మాణానికి మార్కింగ్ వేయడంతో పాటు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు ఆర్థికంగా ఎదగడం వారి స్వావలంబన కోసం ప్రత్యేక భవనాలు సైతం మంజూరు చేయడం సంతోషకరమన్నారు. డ్వాక్రా సంఘాల సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేని విధంగా నూతన భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇట్టి డ్వాక్రా భవనము నిర్మాణం పనులు త్వరలోనే పూర్తి చేయడంతో పాటు అందుబాటులోకి తీసుకురావడం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తదితరులు ఉన్నారు.

# రైతుల అభివృద్ధే ధ్యేయం..!

- కందుల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం
- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- చేవెళ్లలో ఎన్ఎఫ్ఎస్ఎం పథకం కింద విత్తనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**చేవెళ్ల జూన్ 20(ప్రజా జ్యోతి):** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఎన్ఎఫ్ఎస్ఎం (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్) పథకం కింద చేవెళ్ల మండల రైతులకు అందించిన కందుల విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచడం, రైతులను కందుల సాగు వైపు ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను అందిస్తోందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ.. కందుల విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో చేవెళ్ల రైతు వేదిక వద్దకు వచ్చి పొందాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఏడీఏ సురేష్ బాబు, మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్, వ్యవసాయ విస్తరణాధికారులు బాల కోటేశ్వరరావు, కిరణ్మయి, గాయత్రి పాల్గొన్నారు.

# బీజేపీ ఎండోమెంట్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా కేశపల్లి వెంకట్ రాంరెడ్డి

- ఆలయాల పరిరక్షణే లక్ష్యం.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం
- ఎండోమెంట్ సెల్ కన్వీనర్ కేశపల్లి వెంకట్ రాంరెడ్డి



**చేవెళ్ల జూన్ 20(ప్రజా జ్యోతి):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్‌గా కేశపల్లి వెంకట్ రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, ఎండోమెంట్ సెల్ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నావఝ్జల సూర్య ప్రకాష్, కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్‌లకు ధన్యవాదాలు వెల్లడించారు. తెలంగాణలోని పురాతన దేవాలయాల సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంతో పాటు ఆలయ భూములు, ఆస్తుల రక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎండోమెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని స్పష్టం చేశారు. 2028/29 ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నరపరాజు నాయకత్వంలో ముందుకు సాగుతామని తెలిపారు.

# బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శం.!

-మొదటిపేజీ తరువాయి

సమావేశంలో మంచిరెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. పదేళ్ల పాటు తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. రైతు సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, రైతుబంధు పథకం ద్వారా 72 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించామని, రైతు బీమా పథకం ద్వారా వేలాది రైతు కుటుంబాలకు భరోసా కల్పించామని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ హయంలో దేశంలోనే అత్యధికంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు.

**రైతు భరోసా అమలులో స్పష్టత లేకుండా పోయింది...**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా అమలులో స్పష్టత లేకుండా వ్యవహరిస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తోందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయకుండా అనేక నిబంధనలు పెట్టి రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందని అన్నారు.

**బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా...**

బీఆర్ఎస్ పాలనలో యాసంగి, వానాకాలం పంటల ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించామని, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందించామని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో ప్రారంభించిన పబ్లిక్ స్కూల్... మొన్న ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించిన ఆరుట్ల మోడల్ స్కూల్ నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, ఉన్న స్కూల్ కు కలర్ లు వేసి తామే కట్టించినట్టు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే 4సార్లు నియోజకవర్గానికి విచ్చేసిన ముఖ్యమంత్రి ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని, స్థానిక ఎమ్మెల్యే ఎన్ని నిధులు అడిగారో కూడా నిరూపించాలని కిషన్ రెడ్డి అన్నారు.

**సర్పంచ్ ఇచ్చిన వినతి పత్రాన్ని పక్కన పెట్టడం...**

నియోజకవర్గంలోనే పెద్ద గ్రామమైన ఆరుట్లకు నిధులు కేటాయించాలని సర్పంచ్ వినతిపత్రమివ్వగా దానికి పక్కన పెట్టడం సరి కాదని, పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధి పనిచేయాలని, మంత్రి పదవి ఆశతో గ్రామాల అభివృద్ధి పక్కన



పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా గత ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించి, నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి సూచించారు.

## భాగ్యనగర్ వార్డ్‌లో సీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ హెచ్ఎంటి హిల్స్

# జలవాయు విహార్ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం





**కూకట్ పల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి) :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎంసీ కమిషనర్ భాగ్యనగర్ వార్డ్-244 పరిధిలోని హెచ్ఎంటి హిల్స్, జలవాయు విహార్ కాలనీలను శనివారం ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, పారిశుధ్యం, రహదారులు, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై స్థానిక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై విస్తృతంగా చర్చించారు. కాలనీల అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న కమిషనర్, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సూచనలను అధికారుల సమక్షంలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**భూగర్భ డ్రైనేజీ పునరుద్ధరణకు ప్రాధాన్యం**

హెచ్ఎంటి హిల్స్ నుండి జలవాయు విహార్ వరకు ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ చాలా కాలంగా సక్రమంగా పనిచేయకపోవడంతో మురుగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్, హైదరాబాద్ వాటర్ వర్క్స్ సివరేజ్ బోర్డు అధికారులు వెంటనే సర్వే నిర్వహించి డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని, అలాగే భీముని కుంట చెరువు వద్ద ఉన్న అవుట్‌లెట్‌ను విస్తరించే చర్యలు చేపట్టాలని సూచించారు.

**జలవాయు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం**

జలవాయు కాలనీలోని రోడ్ నంబర్లు 3, 4, 5 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్న కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నివాసితులు వివరించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సర్కిల్-51 ఇంజినీరింగ్ విభాగం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు.

**స్థానికంగా పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు**

ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించే దిశగా జలవాయు విహార్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే హెచ్ఎంటి హిల్స్‌లోని చిల్డ్రన్స్ పార్క్‌లో కూడా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి యువత, వృద్ధులకు వ్యాయామ సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

**మురుగునీటి శుభ్రతకు ప్రత్యేక యంత్రం**

జలవాయు కాలనీలో తరచుగా తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం సీవరేజ్ క్లీనింగ్ మెషీన్‌ను అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్, సివరేజ్ బోర్డు అధికారులకు సూచించారు. దీంతో మురుగునీటి లైన్లలో ఏర్పడే అడ్డంకులను వేగంగా తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు**

జలవాయు విహార్ కాలనీలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికను రూపొందించాలని ట్రాఫిక్ పోలీసు శాఖకు సూచించారు. కాలనీవాసుల భద్రతతో పాటు ట్రాఫిక్ సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు**

నివాస ప్రాంతాల్లో పెరుగుతున్న అనధికార నిర్మాణాలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టళ్లపై కఠిన నిఘా ఉంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలనీల పార్కుల్లో రాలిపోయే ఎండు ఆకులను వ్యర్థంగా పారేయకుండా కంపోస్టింగ్ ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ విధానం ద్వారా పార్కుల నిర్వహణతో పాటు పర్యావరణ హిత చర్యలకు ఊతమిస్తుందని అధికారులు తెలిపారు.

**ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి**

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "కాలనీల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుంది. స్థానిక సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలి" అని పేర్కొన్నారు. ప్రజల సూచనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా వార్డ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, వాటర్ బోర్డ్ ప్రతినిధులు, ట్రాఫిక్ శాఖ అధికారులు, ఆర్ డబ్ల్యూ ఏ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.!

- ఆర్ఐ జీపీఓపై దాడిని ఖండించిన ట్రెసా
- తుర్కయంజాల్ లో ఉద్యోగులపై దాడి హేయమైన చర్య
- ట్రెసా రాష్ట్ర కార్యదర్శి గౌతమ్ కుమార్
- రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎస్ జనార్ధన్ రావు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ పరిపాలన అధికారి (జీపీఓ)పై శుక్రవారం జరిగిన దాడిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా), రంగారెడ్డి జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ విధులను నిర్వహిస్తున్న అధికారులపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని, ఇటువంటి సంఘటనలు ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు ముప్పుగా మారడంతో పాటు చట్టబద్ధమైన పరిపాలనకు ఆటంకం కలిగిస్తాయని ట్రెసా పేర్కొంది. ప్రజలకు సేవలందించే క్రమంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై దాడులు జరగడం సహించరానిదని సంఘం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సంఘం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిసి కింది అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది:

1. దాడికి పాల్పడిన వ్యక్తులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు చేపట్టాలి.
2. ఫీల్డ్ విధులు నిర్వహించే రెవెన్యూ సిబ్బందికి తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలి.
3. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి.
4. ప్రభుత్వ ఉద్యోగుల గౌరవం, భద్రత మరియు విధి నిర్వహణకు అవసరమైన రక్షణను ప్రభుత్వం కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా రెవెన్యూ సిబ్బందిలో భద్రతా భావనను పెంపొందించాలని ట్రెసా జిల్లా శాఖ కోరింది. ఈ కార్యక్రమంలో టెస్రా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గౌతమ్ కుమార్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎస్ జనార్దన్ రావు, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.



## శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధనల కలయికే యోగ

- కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు
- పాల్గొన్న మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్





బోయిన్ పల్లి, జూన్ 20.(ప్రజా జ్యోతి): శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధనల సమ్మేళనమే యోగ అని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగాసనాల్లో సూర్యనమస్కారాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రతిరోజూ అరగంటపాటు సూర్యనమస్కారాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జంపన ప్రతాప్ అన్నారు. ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, కరణ్ సింగ్, యాదగిరి, సురేష్, సత్యనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిరోజు యోగ ఆరోగ్యానికి మేలు చేస్తుంది!

కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాధిక...

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు





**ఇబ్రహీంపట్నం జూన్ 20 ప్రజాజ్యోతి:** జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ మరియు వ్యాయామ విద్య విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాధిక మాట్లాడుతూ... ప్రతిరోజు యోగా చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉంటాయన్నారు. యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథక ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ చింతల రాకేష్ భవాని, డాక్టర్ రచన మరియు వ్యాయామ విద్య అధ్యాపకులు డాక్టర్ నర్సింగ్ రావు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, అధ్యాపకులు నరేందర్ రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కరుణ, డాక్టర్ మాధవి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీ కృష్ణ, డాక్టర్ సురేష్, ప్రసాద్, శ్రీశైలం అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత

రూ. 30వేల కోట్ల నిధులు విద్యాశాఖకు కేటాయించడం పట్ల హర్షం

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్






**కూకట్ పల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి) :** రూ. 30వేల కోట్ల నిధులు విద్యాశాఖకు కేటాయించడం ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతని ఇస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. బాలానగర్ మండల పరిధిలోని బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన సందర్భంగా రేణుక, స్ఫూర్తి, విగ్నేష్ లకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గుర్తింపు గౌరవం విద్య ద్వారానే లభిస్తాయని పేర్కొన్నారు .అందరు విద్యార్థులు విజయమే లక్ష్యంగా విద్యలో పోటీపడి చదవాలన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, డివిజన్ ప్రెసిడెంట్ సతీష్ గౌడ్, సుధాకర్ రెడ్డి ఏఎంసీ డైరెక్టర్, రవి గౌడ్, నరసింహులు, రాజేష్, గోపాల్ చౌదరి, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా ద్వారా ఒత్తిడిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చు

పోలీస్ సిబ్బందికి యోగా, ధ్యాన శిక్షణ.. మానసిక ప్రశాంతతే లక్ష్యం

బాలానగర్ సీఐ నర్సింహా రాజు!



**బాలానగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి) :** నిరంతరం విధుల్లో ఉంటూ ఒత్తిడిని ఎదుర్కొనే పోలీస్ సిబ్బంది కోసం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక యోగా, ధ్యాన సాధన కార్యక్రమం నిర్వహించారు. సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో శనివారం ఉదయం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. విధి నిర్వహణలో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం ఎంత అవసరమో ఈ సందర్భంగా సీఐ సిబ్బందికి వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అలసిపోని విధులతో ఒత్తిడికి గురయ్యే పోలీస్ సిబ్బందికి శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడమే లక్ష్యంగా బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. శనివారం ఉదయం స్టేషన్ ప్రాంగణంలో ఎస్ఐలు సరిత రెడ్డి, వినోద్ కుమార్ సిబ్బందితో కలిసి ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా బాలానగర్ సీఐ నరసింహ రాజు మాట్లాడుతూ పోలీసులకు యోగా, ధ్యానం ఎంతో అత్యవసరమని, నిత్య జీవితంలో వీటిని ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. శ్వాసపై నియంత్రణ సాధించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, వృత్తిపరమైన బాధ్యతలను మరింత ఉత్సాహంగా, ఏకాగ్రతతో నిర్వహించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు.” ఈ సాధన శిక్షణలో భాగంగా సిబ్బందికి అలసటను తగ్గించే ఆసనాలు, కోపాన్ని నియంత్రించి ఏకాగ్రతను పెంచే ప్రాథమిక ధ్యాన పద్ధతులు, ప్రాణాయామంపై ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయించారు. యోగా ద్వారా ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని సీఐ నర్సింహా రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరగా పూర్తి చేయాలి

--రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

అత్తాపూర్ లో 1.45 కోట్ల నిధులతో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి)** ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ లో 1.45 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి శనివారం శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ త్రాగునీటి పైపులైన్లను వేసి ప్రజలకు సమస్యలు లేకుండా చేస్తున్నామన్నారు రాజేంద్రనగర్ నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత జిహెచ్ఎంసి అధికారులను, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశించారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకా మిగిలి ఉన్న అభివృద్ధి పనులను అంచలంచలుగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, స్థానిక నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలి

- అధికారులకు అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి సూచన
- రావులపల్లి, మిర్జాగూడ గ్రామాల్లో పర్యటన






**చేవెళ్ల జూన్ 20(ప్రజా జ్యోతి):** గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. చేవెళ్ల మండలంలోని రావులపల్లి, మిర్జాగూడ గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనం, ప్రభుత్వ పాఠశాల, చెత్త డంపింగ్ యార్డులను సందర్శించి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, ఘన వ్యర్థాల నిర్వహణ, చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన అడిషనల్ కలెక్టర్.. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు గోటూరి రామచంద్రయ్య గౌడ్, పర్వేద సుష్మా మల్లేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా బేగరి రాజు నియామకం

సామాజిక సేవలకు గుర్తింపుగా బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్





**మొయినాబాద్, జూన్ 20 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మండలం సురంగల్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బేగరి రాజును రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా జిల్లా కలెక్టర్ నియమించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సూపరింటెండెంట్ యన్. చంద్రశేఖర్ నియామక పత్రాన్ని అందజేశారు. గత 15 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం వంటి అంశాలపై బేగరి రాజు నిరంతరం పోరాటం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అనుసరిస్తూ, రాజ్యాంగబద్ధ హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సేవలందించారు. ఈ సేవలను గుర్తించిన జిల్లా యంత్రాంగం తనను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమించడం గౌరవంగా భావిస్తున్నానని బేగరి రాజు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసైన్డ్ భూముల సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్ తదితరులు పాల్గొని బేగరి రాజుకు శుభాకాంక్షలు తెలిపారు,

# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలి

శంషాబాద్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో వివిధ శాఖల పనితీరు, వర్షాకాల సన్నద్ధంపై సమీక్ష సమావేశం నిర్వహించిన జోనల్ కమిషనర్ చంద్రకళ




**రాజేంద్రనగర్,జూన్ 20 (ప్రజా జ్యోతి)** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని శంషాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళ తెలిపారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శంషాబాద్ సర్కిల్ కార్యాలయంలో వివిధ శాఖల పనితీరు, వర్షాకాల సన్నద్ధంపై సమీక్ష సమావేశం శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ నిర్వహించారు. ఈ సమావేశంలో వర్షాకాలంలో చేపట్టవలసిన ముందస్తు జాగ్రత్తలు, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై, ప్రాపర్టీ టాక్స్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగం, ఎంటమాలజీ విభాగం, స్ట్రీట్ లైట్స్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్, అర్బన్ బయోడైవర్సిటీ తదితర అంశాలపై జోనల్ కమిషనర్ చంద్రకళ సమీక్ష చేసి ఈ అంశాలపై అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం నీ దృష్టిలో ఉంచుకొని అధికారులందరూ అప్రమత్తంగా ఉండి పని చేయాలన్నారు. కాలనీలో మెయిన్ రోడ్డులో ఎక్కడైనా నీరు నిలిచే ప్రాంతాలు ఉంటే గుర్తించి అక్కడ నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటైజర్ పై ప్రత్యేక దృష్టి సారించాలని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూసుకోవాలన్నారు. శంషాబాద్ నుండి రాళ్లగూడ వెళ్లే మెయిన్ రోడ్ లో అండర్ గ్రౌండ్ లీకేజీ పై కూడా ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. 111 జీవో కు విరుద్ధంగా అక్రమ కట్టడాలు కడితే వారిపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు ముఖ్యంగా వర్షాకాల పరిస్థితుల దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ఫీల్డ్ లో ఉండి నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, సూపర్డెంట్ ఇంజనీర్ కిష్టప్ప, సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సులో ప్రయాణిస్తుండగా భూ పాసు బుక్ మిస్...




**తలకొండపల్లి,జూన్ 20 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు గోవింధు విజయ భర్త గోవిందు విజేందర్ యొక్క పట్టా పాసు బుక్ గట్టుఇప్పలపల్లి గ్రామం నుండి బస్సులో హైదరాబాద్ కు వెళ్తుండగా భూ పాసు బుక్ మిస్ కావడం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.గట్టుఇప్పలపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 464/ఉ/1,లో 1:00 ఎకర,464/ఊ/2లో 1:00 ఎకరతో కలిపి 2:00 ఎకరాల పట్టా భూమి ఉన్నట్లు రైతు వెల్లడించారు.పాస్ బుక్ మిస్ కావడం వలన రెవెన్యూ శాఖ అధికారులను రైతు సంప్రదించగా తమ వివరాలతో పాటు భూమి యొక్క వివరాలతో వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీతో మీ సేవ లేదా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ విషయం పట్ల స్థానిక తలకొండపల్లి పోలీస్ స్టేషన్లో శనివారం రైతు గోవింధు విజయ భర్త గోవింధు విజేందర్ తమ భూమికి సంబంధించిన పూర్తి వివరాలతో ఫిర్యాదు చేశారు.రైతు భూ పాస్ బుక్ నెంబర్ ం05260213168 మరియు ఖాతా నెంబర్ ;61633 వివరాలను పిర్యాదులో నమోదు చేసారు.ఎఫ్ఐఆర్ నమోదు చేయగలరని శుక్రవారం ఎస్‌హెచ్ఓ జానికిరాం రెడ్డిని రైతు కోరారు.

# ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చేపట్టాలి

కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకి వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు




**కూకట్ పల్లి, జూన్ 20 (ప్రజా జ్యోతి) :** ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్, బిఆర్ఎస్ వి రాష్ట్ర నాయకులు అశ్వంత్ కుమార్ కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నాయని, విద్యను వ్యాపార సంస్థలుగా మార్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేనందువలన పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని, మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా హాజరు శాతం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, జిల్లా అక్షయ్, సూర్య, పల్లపు గిరీష్, దుర్గా ప్రసాద్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న సేవలో మల్లారెడ్డి.. పుట్టినరోజున రూ.1.21 లక్షల విరాళం

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన కాలే యాదయ్య





**చేవెళ్ల జూన్ 20(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మాజీ వార్డు సభ్యులు మల్గారి మల్లారెడ్డి పుట్టినరోజు వేడుకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య స్వయంగా మల్లారెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్, రాము గౌడ్ సొసైటీ చైర్మన్లు, దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్ వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

**పుట్టినరోజున మల్లన్న గుడికి విరాళం**

మల్గారి మల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా చేవెళ్లలో మల్లన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం రూ. 1.21 లక్షల విరాళాన్ని అందించారు. భక్తుల సౌకర్యాలు, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దైవ భక్తితో పాటు సేవా భావాన్ని చాటుకున్న మల్లారెడ్డి విరాళం ఆదర్శంగా నిలుస్తుందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. మల్లారెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని మల్లన్న స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



**బాలానగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న దాసరి బస్తీ కమ్యూనిటీ హాల్ పనులను శనివారం స్థానికులతో కలిసి బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే జరుగుతున్న పనులు అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిర్మాణంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కమ్యూనిటీ హాల్‌ను నాణ్యతతో కూడిన విధంగా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరి బస్తీ అధ్యక్షులు ఆదిమూల నాగేష్, ఆదేళ్ల జగదీష్, ఆకుల నర్సింగ్, ఘనసాల మహేష్, కంఠం రవి, ఘనసాల ప్రవీణ్‌తో పాటు స్థానిక నాయకులు కందుల రమేష్, రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, నర్రా దేవేందర్ రెడ్డి, జల్దేవర్ ప్రేమ్ కుమార్, ముత్యాల మురళీధర్ ముదిరాజ్, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల మానసిక శారీరక ఎదుగుదలకు పునాది అంగన్వాడీ కేంద్రాలే పునాది







--అంగన్వాడి టీచర్ సుమిత్ర

మైలార్దేవుపల్లి దాసర బస్తీలో బడిబాట

అంగన్వాడి కేంద్రాల్లో చేరిన పలువురు చిన్నారులు

**రాజేంద్రనగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి)** చిన్నారుల మానసిక శారీరక ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలే తొలి పునాది అని మైలార్దేవుపల్లి అంగన్వాడి టీచర్ సుమిత్ర అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా శేరిలింగంపల్లి సెక్టార్ మైలార్దేవుపల్లి డివిజన్లోని దాసర బస్తి ఇంటి వద్ద ఉంటున్న చిన్నారులను బడి వైపు నడిపించేందుకు బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ బడిబాట కార్యక్రమంలో పలువురు విద్యార్థులను అంగన్వాడి కేంద్రంలో చేర్పించారు. బడి బయట ఉన్న ప్రతి విద్యార్థిని గుర్తించి అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య పౌష్టికాహారం సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో నూతన అడ్మిషన్ల మహోత్సవం చేపట్టారు. కొత్తగా చేరిన చిన్నారులకు సాంప్రదాయకంగా అక్షరాభ్యాసం చేయించి విద్యార్థులను తరగతి గదిలోకి సాధారణంగా ఆహ్వానించారు. చిన్నారుల కేరింతలతో అంగన్వాడీ కేంద్రం ఆనందోత్సవాలతో నిండిపోయింది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ సుమిత్ర మాట్లాడుతూ విద్యార్థుల మానసిక శారీరక ఎదుగుదలకు వారి ఉజ్వల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు తొలి పునాది అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీలా ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తుంది తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో ఆట పాటతో కూడిన నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామని ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసుకొని సౌకర్యాలు అంగన్వాడి కేంద్రాల్లో ఉన్నాయన్నారు.తల్లిదండ్రులందరూ ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కాయ సునీత, ఆశా వర్కర్ స్వాతి, కాలనీ మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# కౌకూర్ శ్మశానవాటిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లికార్జున్

**అల్వాల్, జూన్ 20:** ప్రజా జ్యోతి మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని కౌకూర్ హిందూ శ్మశానవాటికను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు జోనల్ కమిషనర్‌ను కోరారు. ప్రజానాయకులు శ్రీ మైనంపల్లి హనుమంతరావు నాయకత్వ స్ఫూర్తితో మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ (ఐఏఎస్), ఎంఎంసీ ఇంజనీర్ డి.ఈ. మాధవాచారితో కలిసి శ్మశానవాటికను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలానికి పూర్వం నుంచే ఉన్న ఈ చారిత్రక శ్మశానవాటిక ప్రస్తుతం సరైన మౌలిక వసతులు, నిర్వహణ లేక తన ప్రాధాన్యతను కోల్పోతోందని వివరించారు. కౌకూర్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో జనాభా గణనీయంగా పెరిగినప్పటికీ శ్మశానవాటికలో తగిన సదుపాయాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు అంత్యక్రియల కోసం అల్వాల్ ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. శ్మశానవాటికను ఆధునిక మోడల్ క్రిమేటోరియంగా అభివృద్ధి చేయాలని కోరుతూ రెండు



వేచిచూసే షెడ్లు, అస్తికల గది, పూజా కార్యక్రమాల కోసం ప్రత్యేక షెడ్, నిరంతర నీటి సరఫరా, హైమాస్ట్ ఎల్ఈడి లైటింగ్, అంతర్గత సీసీ రోడ్లు, కూర్చునే ఏర్పాట్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలం, ప్రహరీ గోడ బలోపేతం, మొక్కల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, డ్రైనేజ్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, వ్యర్థాల నిర్వహణ సదుపాయాలు, సూచిక బోర్డులు తదితర సౌకర్యాలను కల్పించాలని కమిషనర్‌ను కోరారు. పరిశీలన సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు కూడా శ్మశానవాటికకు సంబంధించిన సమస్యలు, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అవసరాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ చారిత్రక శ్మశానవాటికను పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డు శ్రీనివాస్ యాదవ్, బాల్‌రెడ్డి, శివరాజ్, గోమారం అంజి రెడ్డి, అల్లి మల్లేష్, అల్లి పండు, ఆసిఫుల్లా ఖాన్, శ్రవణ్ గౌడ్, రాజేష్, శ్రీశైలం, కౌశల్ యాదవ్, కిష్టయ్య, సామల రాంరెడ్డి, కుసుగుండ్ల శ్రీనివాస్ రెడ్డి, బ్యాగర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల విద్యకు రౌండ్ టేబుల్ ఇండియా అండ



- చేవెళ్ల బడికి 12 తరగతి గదుల కానుక
- తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే
- సంస్థ సేవలను కొనియాడిన ఎమ్మెల్యే కాలే యాదయ్య







**చేవెళ్ల జూన్ 20(ప్రజా జ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రౌండ్ టేబుల్ ఇండియా 134 చేస్తున్న సేవలు అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో రౌండ్ టేబుల్ ఇండియా 134 ఆధ్వర్యంలో నిర్మించిన 12 తరగతి గదుల నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "విద్యాభివృద్ధికి, ముఖ్యంగా బాలికల విద్యకు చేయూతనివ్వడం గొప్ప సామాజిక సేవ. పాఠశాల అభివృద్ధికి సహకరించిన రౌండ్ టేబుల్ ఇండియా 134 సంస్థకు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రభుత్వంతో పాటు విద్యారంగ అభివృద్ధిలో సంస్థ భాగస్వామ్యం కావడం సంతోషకరం" అని అన్నారు."విద్య అనేది సమాజ అభివృద్ధికి మూలస్తంభం. బాలికలు మంచి విద్యను అభ్యసిస్తే కుటుంబం నుంచి దేశ అభివృద్ధి వరకు ప్రభావం ఉంటుంది. నూతన భవనం విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుంది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా 134 ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా అదనపు తరగతి గదులతో పాటు ఆధునిక శానిటేషన్ బ్లాకులు, డెస్కులు, గ్రీన్ బోర్డులు వంటి సదుపాయాలను కల్పించారు. రౌండ్ టేబుల్ ఇండియా 134 ప్రతినిధి సచిన్ మాట్లాడుతూ.. "మౌలిక వసతుల కొరతతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సంస్థ పనిచేస్తోంది. 'ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్' లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశాం" అని తెలిపారు. కొత్త భవనంతో గదుల కొరత సమస్య తీరడంతో విద్యార్థినులు సురక్షితమైన వాతావరణంలో చదువుకునే అవకాశం లభించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆవే మారియా స్కూల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం





**ఉప్పల్,జూన్ 20,( ప్రజా జ్యోతి ):** రామాంతపూర్ లోని ఆవే మారియా స్కూల్ (సి బి ఎస్ ఇ ) ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని, మానసిక ప్రశాంతతను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాభ్యాసం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగా నిపుణులు నేహా విజయ్,పూర్ణిమ విచ్చేసి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సుమారు 45 నిమిషాల పాటు సాగిన ఈ యోగా సెషన్లో, ముందుగా తేలికపాటి సన్నాహక వ్యాయామాలు, ఆ తర్వాత విద్యార్థుల ఏకాగ్రతను పెంపొందిస్తూ, శరీర సౌలభ్యాన్ని మెరుగుపరిచే పలు ప్రాథమిక యోగాసనాలను ఎంతో చాకచక్యంగా నేర్పించారు.వారు మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది మనస్సును, శరీరాన్ని ఏకం చేసే ఒక అద్భుతమైన జీవన విధానమని నిపుణులు వివరించారు ముఖ్యంగా ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని అధిగమించడానికి, మానసిక స్పష్టత కోసం యోగా ఎంతో తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కె. జయ ప్రతాప్ ప్రసంగిస్తూ యోగా అనేది భారతీయులు ప్రపంచానికి అందించిన అపురూపమైన కానుక అని కొనియాడారు. ఇది కేవలం దేహాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, విద్యార్థులలో క్రమశిక్షణను, ధైర్యాన్ని క్లిష్ట సమయాల్లో స్థితప్రజ్ఞతను కలిగి ఉండేలా చేస్తుందని చెప్పారు. నేటి విద్యార్థులు తమ విద్యా లక్ష్యాలను చేరుకోవడంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించి, వికసించాలంటే యోగాను ఒక జీవన మార్గంగా స్వీకరించాలని ఉద్ఘాటించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యోగా నిపుణులకు, ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# యాఫ్ ద్వారా యూరియా విక్రయాలు ప్రారంభం





**తలకొండపల్లి,జూన్ 20 (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన యూరియా బుకింగ్ యాఫ్‌ను అధికారులు,నాయకులతో కలిసి తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి పడకల్ పీఏసీఎస్ గోదాం వద్ద శుక్రవారం ప్రారంబించారు.యాఫ్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ పీఏసీఎస్ గోదాం వద్ద యూరియా20:20,డీఏపి ఎరువులను పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అధ్వర్యంలో రైతులకు పంపిణీ చేయడం జరిగింది.రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచడంతో పాటు,బుకింగ్ చేసిన రైతులకు వేగవంతంగా సరఫరా అయ్యేలా చూస్తామని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,ఆమన్‌గల్ బ్లాక్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి జగ్గారెడ్డి తెలిపారు.రైతులందరూ యూరియా యాఫ్ ద్వారా సకాలంలో ఎరువులను పొందాలని కోరారు.ఎరువులు పక్కదారి పోకుండా రాష్ట్ర ప్రభుత్వం యాఫ్ ద్వారా ఎరువులను పొందే విధంగా రుపోందించడం జరిగిందని తెలిపారు.అనంతరం రైతులు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డిని,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి జగ్గారెడ్డి మరియు సింగిల్ విండో డైరెక్టర్ శివగల్ల యాదమ్మలను రైతులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ప్రతాప్ రెడ్డి,ఎఈఓ శైలఖ్య,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుమ్మరి శంకర్,మాజీ సర్పంచులు శంకర్ నాయక్,జి.రాములు,మాజీ ఎంపీటీసి జోగు.రమేష్, వార్డు సభ్యులు ఎండి వాజీద్,బర్ల చెన్నయ్య,అమృత లింగం,ఎండి మబ్బుల్,సాకలి సత్తయ్య తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు ఎర్వ సాయి కిరణ్ (బంటి)



**కుత్బుల్లాపూర్ జూన్ 20(ప్రజా జ్యోతి )** 127 - రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన నాయకులు ఎర్వ సాయి కిరణ్ (బంటి) తన పుట్టినరోజు సందర్భంగా చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రజాసేవలో మరింత ముందుకు వెళుతూ అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న ఎర్వ సాయికిరణ్ ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియా భారత్ బిల్డ్‌కాన్ 2026ను సందర్శించారు




**శేరిలింగంపల్లి,జూన్ 20 (ప్రజాజ్యోతి):** భవన నిర్మాణ సామగ్రి, నిర్మాణం,మౌలిక సదుపాయాల రంగాలకు భారతదేశపు ప్రతిష్టాత్మక ప్రదర్శన అయిన భారత్ బిల్డ్‌కాన్ 2026, మూడవ రోజున భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి యువజన వ్యవహారాలు ఒ క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా సందర్శనతో మరింత ఊపందుకుంది.న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ ప్రదర్శనను సందర్శించిన సందర్భంగా,మంత్రి భారతీయ కంపెనీలు ప్రదర్శించిన తాజా ఆవిష్కరణలు, సామర్థ్యాలను సమీక్షిస్తూ, ప్రదర్శనకారులు, పరిశ్రమల నాయకులు, తయారీదారులు,అంతర్జాతీయ కొనుగోలు దారులతో సంభాషించారు.ఈ కార్యక్రమం యొక్క స్థాయి,దానికి లభించిన స్పందన చూసి ముగ్ధుడైన మన్సుఖ్ మాండవియా, భారత్ బిల్డ్‌కాన్ తన మొదటి ఎడిషన్‌లోనే అత్యంత విజయవంతమైన వేదికగా ఆవిర్భవించిందని వ్యాఖ్యానించారు. భారత్ బిల్డ్‌కాన్ తన ప్రారంభ ఎడిషన్‌లోనే అద్భుతమైన విజయాన్ని సాధించింది. కేవలం మొదటి రెండు రోజుల్లోనే వచ్చిన సందర్శకుల సంఖ్య, అనేక పారిశ్రామిక ప్రదర్శనలు వాటి మొత్తం వ్యవధిలో పొందే సందర్శకుల సంఖ్యకు దాదాపు రెట్టింపు.ఇది భారతదేశ భవన నిర్మాణ సామగ్రి,నిర్మాణ రంగ పర్యావరణ వ్యవస్థ యొక్క పెరుగుతున్న బలాన్ని, అలాగే దేశీయ,ప్రపంచ మార్కెట్లలో భారతీయ తయారీదారులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రతిబింబిస్తుంది, అని ఆయన అన్నారు.ఈ ప్రదర్శన భారతదేశవ్యాప్తంగా 90కి పైగా దేశాలు,100కి పైగా నగరాల నుండి కొనుగోలుదారులు, ఆర్కిటెక్టులు, బిల్డర్లు, డెవలపర్లు, పంపిణీదారులు,పారిశ్రామిక నిపుణులను ఆకర్షించి,భవన నిర్మాణ సామగ్రి రంగానికి అతిపెద్ద వ్యాపార నెట్‌వర్కింగ్ వేదికలలో ఒకటిగా నిలిచింది. సిరామిక్స్ ఒ స్టోన్, హార్డ్‌వేర్, సిమెంట్ ఒ స్టీల్, ప్లైవుడ్ ఒ లామినేట్స్, ఫర్నిచర్,బాత్‌వేర్, అనుబంధ నిర్మాణ ఉత్పత్తులతో సహా 24 ప్రధాన విభాగాలను కవర్ చేస్తూ,భారత్ బిల్డ్‌కాన్ వేగంగా ఒక కీలకమైన పారిశ్రామిక కార్యక్రమంగా స్థిరపడింది. పెరుగుతున్న అంతర్జాతీయ భాగస్వామ్యంపై మాట్లాడుతూ..భారత్ బిల్డ్‌కాన్ డైరెక్టర్ విశాల్ ఆచార్య ఇలా అన్నారు,90కి పైగా దేశాల నుండి కొనుగోలుదారులు పాల్గొనడం,భారతదేశ తయారీ సామర్థ్యాల పై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విశ్వాసాన్ని తెలియజేస్తోంది. భారతీయ కంపెనీలు అంతర్జాతీయ కొనుగోలుదారులతో నేరుగా అనుసంధానం కావడానికి, ఎగుమతి అవకాశాలను అన్వేషించడానికి,దీర్ఘకాలిక వ్యాపార భాగస్వామ్యాలను నిర్మించుకోవడానికి భారత్ బిల్డ్‌కాన్ వీలు కల్పిస్తోంది.భవన నిర్మాణ సామగ్రి మరియు నిర్మాణ ఉత్పత్తుల కోసం భారతదేశాన్ని ఒక గ్లోబల్ సోర్సింగ్ హబ్‌గా బలోపేతం చేయడంలో ఇటువంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తాయి.దేశీయ పరిశ్రమపై ప్రభావాన్ని వివరిస్తూ,భారత్ బిల్డ్‌కాన్ డైరెక్టర్ జితేంద్ర కతిరియా ఇలా అన్నారు,100కు పైగా భారతీయ నగరాల నుండి వచ్చిన పాల్గొనేవారు సందర్శకులు భారత్ బిల్డ్‌కాన్‌ను నిజమైన జాతీయ వ్యాపార వేదికగా మార్చారు.ఈ ప్రదర్శన తయారీదారులు, ఎగుమతి దారుల నుండి పంపిణీదారులు, వాస్తుశిల్పులు, కాంట్రాక్టర్లు,ప్రాజెక్ట్ డెవలపర్‌ల వరకు మొత్తం విలువ గొలుసు అంతటా అవకాశాలను సృష్టిస్తోంది.ఇక్కడ జరుగుతున్న వ్యాపార పరస్పర చర్యల నుండి పరిశ్రమలోని ప్రతి విభాగం ప్రయోజనం పొందుతోంది.మొదటి మూడు రోజుల్లోనే లభించిన స్పందన, భారతదేశ భవన నిర్మాణ సామగ్రి రంగం యొక్క అపారమైన వృద్ధి సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది.కేపెక్సిల్ ఛైర్మన్ నిలేష్ జెట్‌పారియా ఇలా పేర్కొన్నారు,భారతదేశం ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన తయారీ మరియు మౌలిక సదుపాయాల మార్కెట్లలో ఒకటిగా వేగంగా అభివృద్ధి చెందుతోంది.ఎగుమతులను ప్రోత్సహించడానికి,భారతదేశ ప్రపంచ వాణిజ్య ముద్రను బలోపేతం చేయడానికి భారత్ బిల్డ్‌కాన్ వంటి వేదికలు చాలా కీలకమైనవి.ఈ కార్యక్రమం అంతర్జాతీయ కొనుగోలుదారులను భారతీయ తయారీదారులను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తోంది, ఇది వ్యాపార వృద్ధిని వేగవంతం చేయడానికి,మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు మద్దతు ఇవ్వడానికి సహాయపడుతుంది.భారత్ బిల్డ్‌కాన్ డైరెక్టర్ విజయ్ అఘారా మాట్లాడుతూ..భారత్ బిల్డ్‌కాన్ మొదటి ఎడిషన్‌కు లభించిన అద్భుతమైన స్పందన,ఒక ఏకీకృత పరిశ్రమ వేదిక యొక్క ఆవశ్యకతను ధృవీకరిస్తోంది.ఇక్కడ ఏర్పాటు చేయబడుతున్న వ్యాపార సమావేశాలు,

**కొనుగోలుదారు-విక్రేతల సంభాషణలు,**

నెట్‌వర్కింగ్ అవకాశాలు, ప్రదర్శనకారులకు దీర్ఘకాలిక వాణిజ్య ప్రయోజనాలను చేకూర్చి, భారతదేశ నిర్మాణ,భవన నిర్మాణ సామగ్రి పర్యావరణ వ్యవస్థ వృద్ధికి గణనీయంగా దోహదపడతాయి అని అన్నారు.

## ప్రభుత్వ విద్యాలయాల బలోపేతమే ఉన్నతి మరియు శిక్ష ఫౌండేషన్ లక్ష్యం







తలకొండపల్లి మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదవతరగతి,ఇంటర్ విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రతి ఒక్కరూ ప్రభుత్వ విద్యాలయాలలో చేరి ఉన్నతంగా ఎదగాలి

పేద మధ్యతరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అండగా ఉంటాం

ఉన్నతి మరియు శిక్ష ఫౌండేషన్ ఛైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి

**తలకొండపల్లి,జూన్20 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వ విద్యాలయాలలో చదివే విద్యార్థులందరూ ఉన్నతంగా ఎదగాలని,పేద మధ్యతరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉన్నతి మరియు శిక్ష ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ ఛైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలు,కళాశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబరివచిన విద్యార్థిని,విద్యార్థులకు ఉన్నతిఒశిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి శుక్రవారం విద్యార్థిని,విద్యార్థులను సన్మానం చేసి, రూ.2500లతో నగదు బహుమతి ప్రోత్సహకంగా అందించారు. జూనియర్ కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉన్నతి మరియు శిక్ష ఫౌండేషన్ ఛైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి మాట్లాడుతు.... ప్రభుత్వ విద్యాలయాలలో చదివే విద్యార్థులందరూ ఉన్నతంగా ఎదగాలని,పేద మధ్యతరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉన్నతి మరియు శిక్ష ఫౌండేషన్ అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు.ప్రభుత్వ విద్యాలయాలు బలోపేతం చేస్తే,పేద విద్యార్థులకు ఉపయోగ పడటమే కాకుండా,మట్టిలో మాణి క్యాలు తీసినట్లు అవుతుందన్నారు.అందుకు ఉదాహరణమే ఈ మధ్యకాలంలో వెలువడిన 10వ తరగతి ఫలితాలలో గట్టుఇప్పలపల్లి మరియు తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐఐఐటి బాసరలో సీట్లు సాధించడం మనందరికి గర్వకారణం అని కొనియాడారు.ప్రభుత్వ విద్యాలయాల బలోపేతానికి మా ఫౌండేషన్ నుండి సహాయం,సహకారాలు ఉంటాయని తెలియజేశారు.ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ....విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు,గురువులకు మంచిపేరు తెచ్చి సమాజానికి తోడుపడాలని తెలిపారు.ఉన్నతి మరియు శిక్ష ఫౌండషన్ సేవలు అభినందనీయం అని కొనియాడారు. ఎంపీడీఓ సీతారావమ్మా మాట్లాడుతూ....విద్యార్థులు చెడు అలవాట్లకు పోకుండా,ఫోన్లు వాడకుండా మంచి క్రమశిక్షనతో ఎదగాలని,విద్యను మించిన శక్తీ వంతమైన ఆయుధంలేదని తెలిపారు.ఈ కార్యక్రమలో ఎంఈఓ చాంప్లనాయక్,ఫౌండేషన్ సెక్రటరీ బండి రఘుపతి,సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్,ఏఎంసి డైరెక్టర్ అంజయ్య గుప్త,జిల్లా పరిషత్ తలకొండపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ, జూనియర్ కళాశాల అకాడమిక్ ఇంచార్జి కృష్ణకాంత్,మాజీ ఉప సర్పంచ్ పద్మ అనిల్,వార్డు సభ్యులు కనుక వెంకటయ్య, ఫౌండేషన్ సభ్యులు శ్రీరామ్,రమేష్, యాదగిరి, నితిన్,శివ, మల్లేష్,విద్యార్థులు,తల్లిదండ్రులు,అధ్యాపకులు,అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకలి తీర్చడం అత్యున్నత సేవ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్





**శేరిలింగంపల్లి,జూన్ 20 (ప్రజాజ్యోతి):**

ఆకలి తీర్చడం అత్యున్నత సేవ అనే మాటకు హోప్ ఫౌండేషన్ అక్షరాలా రూపం ఇస్తోంది. చందానగర్ లో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్య క్రమం 189వ వారాన్ని పూర్తి చేసుకుంది.శనివారం కూడా వేలాది మంది అన్నార్తుల కు రుచికరమైన భోజనం వడ్డించారు.2018 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పటి నిబంధనల మధ్య వలస కూలీలు, రోడ్డుపై జీవించే వారికి అన్నం అందింతున్నారు.ఎండ,వాన,చలి ఏదైనా సరే శనివారం రాగానే చందానగర్లో వంట మొదలవుతుంది.ఈ కార్యక్రమంలోఫౌండేషన్ నిర్వాహకులు, వాలంటీర్లు పాల్గొంటారు. వచ్చిన వారందరికీ కుల,మత,ప్రాంత వివక్ష లేకుండా భోజనం పెడతారు.ఇంతమంది వచ్చినా క్రమశిక్షణ, పరిశుభ్రత పా టిస్తారు.వడ్డన నుంచి ప్లేట్లు తొలగించడం వరకు అన్నీ క్రమపద్ధతిలో జరుగుతాయి.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మేం చేస్తున్నది పెద్ద సేవ కాదు. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం మనిషి బాధ్యత.ఆ బాధ్యతను హోప్ ఫౌండేషన్ ద్వారా నెరవేరుస్తున్నామనీ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ అన్నారు.వచ్చిన వారి ముఖంలో కనిపించే తృప్తే మాకు ఇచ్చే బహుమతి అని తెలిపారు.189 వారాల్లో లక్షలాది మంది ఆకలి తీరింది.ఈ మానవతా యజ్ఞం ఇంకా కొనసాగుతుందని, 200వారాల మైలురాయిని త్వరలో చేరుకుంటుందని నిర్వాహకులు చెప్పారు.ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్‌లో ఘనంగా టాప్ గేర్ కార్ డెకార్స్ ప్రారంభం!






**ఉప్పల్,జూన్20,(ప్రజా జ్యోతి)** ప్రజల మధ్యే ఉంటూ, యువత అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలిచే రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ నూతనంగా ప్రారంభమైన టాప్ గేర్ కార్ డెకొరేస్ షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఫీక్ మాట్లాడుతూ, “స్వయం ఉపాధితో యువత ముందుకు రావడం సమాజ అభివృద్ధికి నిదర్శనం. వ్యాపార రంగంలో కొత్త అవకాశాలు సృష్టిస్తూ స్థానిక యువతకు ఉపాధి కల్పించే ప్రతి ప్రయత్నానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంది” అని పేర్కొన్నారు. యువత కలలకు అండగా వ్యాపార అభివృద్ధికి తోడుగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి మంచి కార్యక్రమంలో ముందుండే నాయకుడు మహమ్మద్ రఫీక్ పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టాప్ గేర్ కార్ డెకొరేస్ మరింత అభివృద్ధి చెంది, వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదిస్తూ విజయపథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ… “ప్రజల అభివృద్ధి కోసం పోరాటం ఒక వైపు యువత భవిష్యత్తు కోసం ప్రోత్సాహం మరో వైపు ఇదే మహమ్మద్ రఫీక్ నాయకత్వం!”

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

---అధికారులకు సూచించిన మున్సిపల్ ఛైర్పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి



**శామీర్ పేట్, జూన్ 20,)(ప్రజాజ్యోతి)** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పటిష్ట చర్యలు చేపట్టాలని అలియాబాద్ మున్సిపాలిటీ ఛైర్మన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి అధికారులకు సూచించారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని శనివారం నాలాల పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటరెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోయే వర్షాల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, నాలాల శుభ్రత, రోడ్ల మరమ్మతులు, నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## అబ్దుల్లాపూర్ మెట్టు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 20 (ప్రజాజ్యోతి)** అబ్దుల్లాపూర్ మెట్టు గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు సహకరించాలని అబ్దుల్లాపూర్ మెట్టు గ్రామపంచాయతీ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ శనివారం తొర్రూర్ లోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి క్యాంప్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలుసుకొని విజ్ఞప్తి చేశారు. అబ్దుల్లాపూర్ మెట్టు గ్రామపంచాయతీలో పలు సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని సమస్యల పరిష్కారం కోసం నిధుల మంజూరుకు సహకరించాలని ఆయన కోరారు. అందుకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ తెలిపారు.

# డివిజన్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

## కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్






**శేరిలింగంపల్లి, జూన్ 20 (ప్రజాజ్యోతి):** శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి విలేజ్ లో ప్రజల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ముఖ్య అతిథులుగా హాజరైన పిఏసీ ఛైర్మెన్, శాసనసభ్యులు అరెకపూడి గాంధీ,యాదవ కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మెన్ రఘునాథ్ యాదవ్, హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు తో కలిసి కమ్యూనిటీ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా డివిజన్‌లో మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని.. నూతన కమ్యూనిటీ హాల్ ద్వారా స్థానికులకు వివిధ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం లభిస్తుందని అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండేలా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టినామని, భవిష్యత్తులో కూడా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.అనంతరం లింగంపల్లి విలేజ్, వెంకట్ రెడ్డి కాలనలో నెలకొన్న పలు సమస్యలపై పాదయాత్ర చేస్తూ పర్యవేక్షించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్థానిక నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగంపల్లి విలేజ్ డెవలప్మెంట్ కమిటీ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్,శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ రాజు యాదవ్,మాజీ కౌన్సిలర్ లక్ష్మి నారాయణ గౌడ్,జి జనార్దన్ రెడ్డి,కే రాంచందర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డు మెంబర్ కవిత, వార్డు మెంబర్ శ్రీకళ,వార్డు మెంబర్ రాము, లక్ష్మణ్ యాదవ్,శ్రీకాంత్ దేవులపల్లి, రాజ్ కుమార్,రవీందర్, రమేష్,రవి,సాయన్న, రాజారెడ్డి, కోదండరాం,పాండు ముదిరాజ్, గఫుర్, పొట్ట మల్లికార్జున్, బాలరాజ్ యాదవ్, సత్యనారాయణ యాదవ్,నర్సింహా, కుమార్, వెంకటేశ్వర్లు, ఖాజా పాషా,అజీమ్, మహేందర్ సింగ్, మొయిస్, రాజు యాదవ్, రవి, అహ్మద్, శేఖర్, జ్ఞానేశ్వర్, రేణుక,రాజు,స్రవంతి, ఖంసమ్మ, బసుదేవ్, కిషోర్ యాదవ్,పులి సాయి,శివరాం యాదవ్, రఘు యాదవ్,భరత్ గౌడ్, హరీష్ యాదవ్, రేవంత్,నరేష్, కిరణ్ ముదిరాజ్, సల్మాన్, కే విజయ్ యాదవ్, హరీష్ ముదిరాజ్, మహేష్ దేవులపల్లి మహిళలు చంద్రకళా, సుజాత,కుమారి, కళ్యాణి,లక్ష్మి, ముంతాజ్ బేగం, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

## తాడి బోయిన రామస్వామి

**శేరిలింగంపల్లి,జూన్ 20 (ప్రజాజ్యోతి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూ బ్లూమ్ హై స్కూల్, సఫారీ నగర్, కొత్తగూడలో యోగా అవగాహన,సాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురువు వి. రామారావు విద్యార్థులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు కాలనీవాసులతో కలిసి యోగాసనాలు, ప్రాణాయామం,ధ్యాన సాధనలను నిర్వహించారు.ముఖ్యంగా విద్యార్థులలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే యోగాసనాలను ప్రదర్శించి అభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ... యోగా అనేది కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించేందుకు ఐక్యరాజ్యసమితి 2015 సంవత్సరం నుండి ప్రతి ఏడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు.ఈ సంవత్సరం యోగా దినోత్సవం యొక్క ప్రధాన అంశం ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అని వివరించారు.యోగా సాధన ద్వారా శారీరక, మానసిక, భావోద్వేగ,సామాజిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు.యోగాలో ప్రధానంగా యోగాసనాలు, ప్రాణాయామం మరియు ధ్యానం అనే మూడు ముఖ్యమైన అంశాలు ఉంటాయని వివరించారు.క్రమబద్ధమైన యోగా సాధన వల్ల కండరాలు బలపడటం, రక్తప్రసరణ మెరుగుపడటం,శరీర సౌష్టవం పెరగటం,అలసట తగ్గటం,శక్తి స్థాయిలు పెరగటం,జీవక్రియ మెరుగుపడటం వంటి అనేక




ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.అదేవిధంగా ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి మానసిక సమస్యలను అధిగమించడంలో కూడా యోగా సమర్థవంతంగా సహాయపడుతుందని చెప్పారు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగా సాధనతో పాటు సమతుల ఆహారం, తగినంత నీటి సేవనం, శారీరక చలనం, సరైన విశ్రాంతి మరియు సానుకూల ఆలోచనలు అవసరమని సూచించారు. ధూమపానం,మద్యపానం మరియు మాదకద్ర వ్యాల వినియోగానికి దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యకం౯మైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. యోగశాస్త్రాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి పతంజలి సేవలను స్మరించుకుంటూ, యోగా ద్వారా వ్యక్తి శారీరక, మానసిక,ఆధ్యాత్మిక వికాసాన్ని సాధించగలడని పేర్కొన్నారు. వ్యాధి లేని శరీరం వేదన లేని మనస్సు అనే లక్ష్యాన్ని సాధించడానికి యోగా ఒక అద్భుతమైన మార్గమని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యూ బ్లూమ్ హై స్కూల్ కరస్పాండెంట్ శ్రీ కిరణ్,యోగా ట్రైనర్ లక్ష్మి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గంగల గణేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ..!

- కాంగ్రెస్ హామీలన్నీ గాలిమాటలే!
- విత్తనాల కొరతతో అన్నదాతల ఆవేదన
- యూరియా కోసం యాప్ తిప్పలు
- రైతు భరోసా అమలు కాని పరిస్థితి
- కాంగ్రెస్ పార్టీపై బిఆర్ఎస్ నేతల ధ్వజం



**చేవెళ్ల జూన్ 20(ప్రజా జ్యోతి):** రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వర్షాకాలం ప్రారంభమైనా రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. చేవెళ్ల మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పట్లోల్ల కృష్ణారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశమోల్ల ఆంజనేయులు, మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ అనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ.. యూరియా కోసం యాప్ విధానం రైతులకు భారంగా మారిందని, క్షేత్రస్థాయి వ్యవస్థను బలోపేతం చేయకుండా డిజిటల్ విధానాలతో సమస్యలు పెంచుతున్నారని విమర్శించారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా నేరుగా ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. పట్లోల్ల కృష్ణారెడ్డి (మాజీ డీసీఎంఎస్ చైర్మన్) మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతు హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15,000 రైతు భరోసా ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమ కాలేదని అన్నారు. దేశమోల్ల ఆంజనేయులు (మాజీ ఇన్‌చార్జి) మాట్లాడుతూ.. కౌలు రైతులకు సాయం, వరి బోనస్ విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం రైతులను మోసం చేయడమేనని వ్యాఖ్యానించారు. అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామాల్లో విత్తనాల కొరత తీవ్రంగా ఉందని, కల్తీ విత్తనాలను అరికట్టి రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున చేవెళ్లలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నవాబ్ పేట్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, కౌన్సిలర్లు దూత మల్లేష్, చందు, తలారి యాదయ్య బేగరి నర్సింలు, గోపాల్, చాకలి కృష్ణ, గోనె కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మిట్ట వెంకట రంగారెడ్డి, ఊరడి రాంప్రసాద్, సుదర్శన్, వెంకటేష్, మాధవరెడ్డి, ఉపేందర్ పృధ్వి మహేష్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

----ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్

---కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్





**శామీర్ పేట్, జూన్ 20,(ప్రజాజ్యోతి)** రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏఎంసీ ఛైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్,ఆర్టీఏ మెంబర్ భిమిడి జైపాల్ రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్ లో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కటికల గోపి ముదిరాజ్ ఆధ్వర్యంలో దండు లలిత యాదగిరి లకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం, కౌన్సిలర్లు సిహెచ్. సరిత శ్రీనివాస్ గౌడ్, కె. శ్రీవాణి వైద్యనాథ్, నాయకులు గుర్రం బస్వా రెడ్డి, బండి రవీందర్, సిహెచ్ మురళి గౌడ్, కత్తి రమేష్, దండు జగ్గయ్య, భీమరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రాన్ని కాన్వాస్పై ఆవాలతో రూపు దిద్దిన కార్టూనిస్ట్ నాగార్జునపు రాము



**ఉప్పల్,జూన్20,(ప్రజాజ్యోతి):** తెలంగాణ రూపశిల్పి, తెలంగాణ జాతిపిత కీర్తిశేషులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ కు చెందిన ప్రముఖ సీనియర్ చిత్రకారుడు కార్టూనిస్టు నాగార్జునపు రాము తన చిత్రకళ నైపుణ్యంతో వినూత్నంగా జయశంకర్ చిత్రాన్ని కాన్వాస్ క్లాత్ పై ఆవగింజలతో రూపొందించి వర్ధంతి నివాళులు అర్పించారు

# లింగరావుపల్లిలో ఘనంగా బడిబాట కార్యక్రమం



**తలకొండపల్లి,జూన్20 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరుతూ లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాల బలోపేతంకై ప్రతి ఒక్కరూ భాగ్యస్వామ్యం వహించాలని వారు కొనియాడారు.అనంతరం వేసవికాల సెలవులు ముగియడంతో 1వ తరగతిలో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు అక్షర బ్యాసాన్ని నిర్వహించారు.అలాగే విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బూత్కూరి వెంకట్ రెడ్డి,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి,ఉపాద్యాయులు ప్రసన్న శ్రీ,ఆనంద్ రావు,వార్డు సభ్యులు రాజమౌని భాగ్య,ఎం.శ్రీజ,చింతలపల్లి సురేందర్ రెడ్డీ,బొచ్చుపల్లి శేఖర్,అంగన్వాడీ ఉపాధ్యాయురాలు భారతి,రత్నమ్మ,సాత్విక,మహిళ సంఘం అధ్యక్షురాలు వసంత,గ్రామ పెద్దలు,యువకులు,నాయకులు,మహిళలు తదితరులు ఉన్నారు.

# మహిళా ప్రాణాలు కాపాడిన ఉప్పల్ పోలీసులు





**ఉప్పల్,జూన్20,(ప్రజాజ్యోతి):** శుక్రవారం రాత్రి ర సుమారు 2300 గంటలకి బోడుగ స్వాతి ఖ/శ్రీ శ్రీనివాస్, వయస్సు 56 ఎతీం, నివాసం. మమతా నగర్, నాగోల్ ఒంటరిగా ఉప్పల్ బాగాయత్ లో ఒంటరిగా సంచరిస్తుంటే ఉప్పల్ బ్లూ కాల్ట్స్ కాన్స్టేబుల్ మోహన్ చౌహాన్, శివ కృష్ణ ఆమెను వివరాలు తెలుసుకోగా ఇంట్లో గొడవపడి సుసైడ్ చేసుకుందాం అని మూసి వద్దకు వెళు _న్నాను అని తెలుపగ ఆమెకు కౌన్సెలింగ్ చేసి వెంటనే వాళ్ళ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వారికి సురక్షితంగా అప్పగించడం జరిగింది

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

# చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలి

– తలకొండపల్లి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్.





**తలకొండపల్లి,జూన్20 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో రెడున్నరేళ్ల వయసు నుంచి ఐదేళ్ల లోపు ఉన్న చిన్నారులందరిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని తలకొండపల్లి సర్పంచుల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్ అన్నారు.తలకొండపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు 1,2,3లలో ఉన్న చిన్నారులకు శుక్రవారం నాయకులు,అంగన్‌వాడీ ఉపాధ్యాయులు,గ్రామ ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్‌లతో కలిసి సర్పంచ్ శేఖర్ యాదవ్ అక్షరాభ్యాసం చేశారు.అనంతరం చిన్నారులకు యూనిఫాం,పౌష్టికాహారం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ప్రైవేటు పాఠశాలలకు పోటీగా అంగన్వాడీ కేంద్రాలు నడుస్తున్నా యన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆట,పాట,ఆహ్లాదకరమైన వాతావరణం, భోజనం,గుడ్డు, పాలు, పిల్లలకు స్నాక్స్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.రెడున్నరేళ్ల వయసు నుంచి ఐదేళ్ల లోపు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్‌తో పాటు గ్రామ ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యం,అంగన్వాడీ ఉపాధ్యాయులు అరుణ,స్వరూప,యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఆర్టీసీ బస్సుపై యువకుడు దాడి





**తలకొండపల్లి,జూన్20 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సుపై యువకుడు మద్యం మత్తులో రాయితో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది.మిడ్జిల్ నుండి సంతోష్ నగర్ వెళ్లే టిజి 07యూ 0088 గల ఆర్టీసీ బస్సుపై యువకుడు రాయితో దాడి చేయడంతో సైడ్ అద్దం పూర్తిగా ధ్వంసం అయినట్లు డ్రైవర్ తెలిపారు.అతి వేగంతో బస్సుపై యువకుడు రాయితో కొట్టడంతో అద్దం ధ్వంసం అయి ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం సంబవించకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.బస్సులో ప్రయాణికులకు యువకుడు విసిరిన రాయి తగిలితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేశారు.అప్రమత్తం అయిన డ్రైవర్,కండక్టర్లు వెంటనే తలకొండపల్లి పోలీసు స్టేషనులో పిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

# గంటల కౌంట్‌డౌన్‌తో యోగా మహోత్సవం ఘన విజయం

వేలాదిమందితో పరేడ్ గ్రౌండ్స్‌లో అద్భుతంగా నిర్వహణ

దేశంలోనే ప్రత్యేకతగా హైదరాబాద్‌లో ఏడో ఏడాది కార్యక్రమం : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**బోయిన్ పల్లి, జూన్ 20.(ప్రజా జ్యోతి):** అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సరిగ్గా 24 గంటల ముందు నిర్వహించే “24 గంటల కౌంట్‌డౌన్” యోగా మహోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. గత ఏడు సంవత్సరాలుగా దేశంలోనే ప్రత్యేకంగా జూన్ 20న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.శనివారం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన యోగా మహోత్సవంలో తెలంగాణ గవర్నర్‌తో పాటు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సినీ ప్రముఖులు, సెలబ్రిటీలు, వివిధ యోగా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారని తెలిపారు.ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఒక రోజు ముందు నిర్వహించే ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా వేలాదిమంది పాల్గొని యోగా మహోత్సవాన్ని విజయవంతం చేశారని చెప్పారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారు ఉత్సాహంగా, ఆనందంగా, సామూహికంగా యోగాసనాలు చేస్తూ ఆరోగ్యవంతమైన జీవన విధానానికి తమ మద్దతును తెలియజేశారని ఆయన అన్నారు.

# రెవెన్యూ ఉద్యోగులపై దాడి ఘటనపై ఆగ్రహం

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ట్రెసా విజ్ఞప్తి

విధి నిర్వహణలో ఉన్న అధికారులకు రక్షణ కల్పించాలని డిమాండ్



**మొయినాబాద్ :జూన్ 20( ప్రజా జ్యోతి)** అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని తూర్కయంజాల్ గ్రామంలో రెవెన్యూ అధికారులపై జరిగిన దాడి ఘటనపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. తూర్కయంజాల్ గ్రామంలోని సర్వే నెంబర్ 338లో ఉన్న వివాదాస్పద భూమిని శాంతి భద్రతల దృష్ట్యా వివాదం పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలని ఆర్డీవో ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్థల పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా మండల గిర్దవర్ ప్రేమ్ కుమార్, గ్రామ పాలనా అధికారి హన్మంత్ విధులు నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు వారిని అడ్డుకుని దుర్భాషలాడటంతో పాటు దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన రెవెన్యూ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. దీంతో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ ఉద్యోగులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఐఏఎస్‌ను కలిసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రెవెన్యూ అధికారులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రారెడ్డిని కలిసి సంఘటన వివరాలను తెలియజేశారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాణిరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఆర్ఐ రాంబాబు, బాధితులు ప్రేమ్ కుమార్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి

సర్ పై బిఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

ఇంటింటి గణన జూన్ 25 నుంచి జూలై 24 వరకు

అభ్యంతరాల స్వీకరణ జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు

అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా ప్రచురణ



**యాచారం, జూన్ 20 (ప్రజాజ్యోతి):** ఎలక్షన్ కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు తహసిల్దార్ కార్యాలయం (ఐకెపి భవనం) లో శనివారం ఓటరు జాబితా సవరణపై (సర్) పై ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బిఎల్ఓలకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాణి, డిప్యూటీ తహసిల్దార్ సాగర్, ట్రైనర్ మోతిలాల్ పాల్గొని ఓటరు జాబితాల సవరణపై (సర్) దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో ఉన్న ఓటర్లంతా తరచూ ఇతర ప్రదేశాలకు వలసలు వెళ్లడం వల్ల ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులు చోటు చేసుకుంటున్న క్రమంలో ఒక ప్రదేశం కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు కావడం, మరణించిన ఓటర్లను తొలగించకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అర్హులైన వారంతా ఓటరు జాబితాలో నుంచి తప్పిపోకుండా అనర్హులెవరు చేరకుండా ఎన్నికల సంఘం సర్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. బిఎల్వోలు ఇంటింటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి ఫారాలు నింపడంలో మార్గదర్శకత్వం చేయనున్నట్లు చెప్పారు. ఓటర్లు ఫారాలను పూర్తి చేశాక బిఎల్వోలు తదుపరి సందర్శనలో స్వీకరిస్తారని చెప్పారు. బిఎల్వోలు కొత్త ఓటర్ల నమోదు కోసం డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం -6 ను కూడా పంపిణీ చేస్తారన్నారు. బిఎల్వో లు ప్రతి ఇంటిని మూడు పర్యాయాలు సందర్శిస్తారని చెప్పారు. ఈ నెల 25 నుండి ప్రారంభమై అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో సర్ ప్రక్రియ కాలవ్యవధి ముగుస్తుందన్నారు.

**ఓటరు జాబితా సవరణలో (సర్) వివిధ దశలు**

అనంతరం ఓటర్ జాబితా సవరణలో (సర్) వివిధ దశలను వివరించారు. మొదట ఇంటింటి గణన జూన్ 25 నుండి జూలై 24 వరకు కొనసాగుతుందన్నారు. మూసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జులై 31న ఉంటుందని, అభ్యంతరాల స్వీకరణకు జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఉంటుందన్నారు. అభ్యంతరాల పరిష్కారాలకు ఈఆర్ఓల. పరిశీలన జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుందన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ అక్టోబర్ 1న ఉంటుందన్నారు. శిక్షణలో బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ యూపీఎస్సీ మెయిన్స్ పుస్తకాల ఆవిష్కరణ



**హైదరాబాద్** భారతదేశంలోని ప్రముఖ సివిల్ సర్వీసెస్ శిక్షణా సంస్థలలో ఒకటైన ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా జనరల్ స్టడీస్, ఆప్షనల్ సబ్జెక్టులకు సంబంధించిన పీవైక్యూ ఌ ఆన్సర్స్ పుస్తకాలను విడుదల చేసింది. ఈ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని అశోక్ నగర్ బ్రాంచ్ లో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సంఘమిత్ర మేడమ్, అధ్యాపక బృందం మరియు యూపీఎస్సీ ర్యాంకర్లు పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించారు. గత 40 సంవత్సరాలుగా ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ యూపీఎస్సీ అభ్యర్థులకు మంచి కోచింగ్‌తో పాటు.. సరైన మార్గదర్శకత్వం అందిస్తూ.., అనేక మందిని సివిల్స్‌లో ఉన్నత ర్యాంకర్లను తయారు చేసిన సంస్థగా గుర్తింపు పొందిన విషయం మీ అందరికి తెల్సిందే. ఇదే తరుణంలో యూపీఎస్సీ సివిల్స్ అభ్యర్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని... సిలబస్‌కు అనుగుణంగా.. గత కొన్ని సంవత్సరాల యూపీఎస్సీ సివిల్స్ ప్రశ్నలు, అలాగే ఈ ప్రశ్నలకు సంబంధించిన వివరణాత్మక సమాధానాలను సరికొత్తగా అన్ని ఫార్మాట్లు పుస్తకాల రూపంలో తీసుకురావడం జరిగింది

# షాద్‌నగర్‌లో మట్టి మాఫియా ఆగడాలు..!

వందల లారీలతో హైదరాబాద్‌కు విలువైన మట్టి తరలింపు

చెరువులు, పంటకాలువలు కబ్జాలకు గురవుతున్నాయి

పోలీసు--రెవెన్యూ శాఖల మౌనం వెనుక మర్మమేంటి..?

షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం



**కొత్తూర్ జూన్ 20 (ప్రజా జ్యోతి)** షాద్‌నగర్ నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోందని, రైతులకు ఉపయోగపడాల్సిన విలువైన మట్టి వందల లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిపోతోందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తరలింపుపై పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానికి ప్రధాన ఆధారాలైన చెరువులు, పంటకాలువలు, వాగులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం...

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రథమ లక్ష్యం

– టాస్క్ సి.ఓ.ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**తలకొండపల్లి,జూన్20 (ప్రజాజ్యోతి)** కల్వకుర్తి నియోజకవర్గ నిరుద్యోగ నిరుపేద యువతి,యువకులకు ఉపాధి కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యంమని టాస్క్ సి.ఓ.ఓ మరియు ఐక్యత ట్రస్ట్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం తుక్కుగూడలోని ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ కంపెనీలో గత రెండు వారాల క్రితం ఇంటర్వ్యూకు హాజరై నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించిన 9మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించారు.ఉద్యోగంలో మొదటి రోజు చేరే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై ఉద్యోగం సాధించిన యువకులను అభినందించారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ...యువత కష్టపడి చదివి,నైపుణ్యాలను పెంపొందించుకొని ప్రతిష్టాత్మక సంస్థల్లో,కంపెనీలల్లో ఉద్యోగాలు పొందడం ఎంతో సంతోషకరమని అన్నారు.ఉద్యోగం సాధించిన యువత ఇతర నిరుద్యోగులకు ఆదర్శంగా నిలవాలని,తమ వృత్తిలో రాణిస్తూ,ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు.యువత తమ ఉజ్వలమైన భవిష్యత్తు నిర్మాణం కోసం అడుగులు వేయాలని ఆకాంక్షించారు.యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్‌లు,ఉచిత శిక్షణా కేంద్రాలు,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు,అవగాహన కార్యక్రమాలు మరింత మంది యువతకు ఉపయోగపడాలని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ,సహకారాల కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని అర్హత ఉన్న నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా నిరుద్యోగ యువత మాట్లాడుతూ..మా భవిష్యత్ గురించి ఆలోచిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మాకు తోడ్పాటునందిస్తున్నందుకు,ఇంత మంచి అవకాశం కల్పించినందుకు ఎల్లవేళలా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్,నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం కోసం అంగన్వాడీల కృషి అభినందనీయం

----గుడిమల్కాపూర్ డైరెక్టర్ బండారి శంకర్





**రాజేంద్రనగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి)** ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం అంగన్వాడీలు చేసిన కృషి అభినందనీయమని గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా గుడిమల్కాపూర్ డైరెక్టర్ బండారి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. అదేవిధంగా చిన్నారులకు స్కూల్ యూనిఫామ్ ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారం చిన్నారులతోపాటు గర్భిణీలు బాలింతలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రధానంగా చిన్నారులకు అందించే పౌష్టిక ఆహారంతో భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం అవుతుందన్నారు. అంగన్వాడి భవన నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెలుతానన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ మేనేజర్, ఆశా వర్కర్ స్థానిక నాయకులు రమేష్, శేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

**కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ లను ఆశ్రఇంచండి**

**--రంగారెడ్డి జిల్లా అదనపు జడ్జి అపర్ణదేవి**

**జాతీయ లోక్ అదాలత్ లో 2,988 కేసుల పరిష్కారం**



**రాజేంద్రనగర్, జూన్ 20 (ప్రజా జ్యోతి)** పెండింగ్ లో ఉన్న కేసులు రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా అదనపు జడ్జి అపర్ణదేవి తెలియజేసారు. ఈ నెల 16 నుండి 20వరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ కోర్టు భవనముల సముదాయం లో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 2,988 కేసులను పరిష్కరించారు. వాటిలో రాజీ పడిన కేసులు 158,అడ్మిషన్ కేసులు 619, విద్యుత్ చౌర్యం కేసులు 72, సైబర్ క్రైమ్ కేసులు 28,డ్రేంకన్ డ్రైవ్ కేసులు 2,078 పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు శ్రీనివాస్, నర్మద, నరేష్, ఉదయ్ నాయక్ రత్నకుమారి, శోభ, వేణుగోపాల్ రెడ్డి, ఏపిపిలు క్రిష్ణ మూర్తి, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికాంత్ రెడ్డి, కార్యదర్శి నరసింహ చారి, లోక్ అదాలత్ సభ్యులు, శ్రీధర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, సుజాత, అనిల్ చారి, తులసిరామ్ నాయక్, రజనీకాంత్ గౌడ్, సోమశేఖర్, ఉష, ప్రవిణ్, సునీత, అస్మ, కోర్టు సిబ్బంది ఆషమ్ అలి, డేవిడ్, నర్సింగ్, వెంకటేష్, నరేష్ గౌడ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా మహోత్సవానికి ముందుగా వాకర్లకు వైట్ టీ-షర్టుల పంపిణీ

**ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా అవసరం : ముద్దం నర్సింహ యాదవ్**



**బోయిన్ పల్లి, జూన్ 20.(ప్రజా జ్యోతి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న బోయిన్‌పల్లి శ్రీ కృష్ణస్వామి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న యోగా మహోత్సవం సందర్భంగా, ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ శ్రీ ముద్దం నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో వాకర్లకు 60 వైట్ టీ-షర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉత్తమ మార్గమని, యువతతో పాటు అన్ని వయసుల వారు యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్ (రాజు), కిరణ్ కుమార్ గౌడ్, లింగన్న, ఎడ్ల ప్రభాకర్, సంతోష్ శర్మ, మహేష్ శర్మ, సిద్ధిరాం రెడ్డి, శీను ముదిరాజ్, భరత్, ప్రమోద్, చందు లాల్, భారత్ ఫిట్‌నెస్ హబ్ సభ్యులు, వాకర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గో టు విలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మూలి మహేష్**



**యాచారం, జూన్ 20 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మూలి మహేష్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహేష్ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టనున్న 'గో టు విలేజ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నేడు గ్రామాల్లో చదువుకోవాల్సిన కొందరు పిల్లలు, నేటితరం యువత మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియాకు అలవాటు పడి తమ మెరుగైన భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువత మొబైల్ ఫోన్లలో రీల్స్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, పబ్జి, ఆన్లైన్ గేమ్లతో తమ మేధస్సును ఫోన్లోకి అంకితం చేసి తమ విలువైన బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని చెప్పారు. గ్రామాల్లోని విద్యార్థులకు, యువతకు గో టు విలేజ్ కార్యక్రమాల ద్వారా ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మండల అధికార ప్రతినిధి మస్కు యాదగిరి తదితరులు సమావేశంలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

## చిట్టీల మాస్టర్‌పై సస్పెన్షన్

**వరంగల్ :** బడిలో పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. బయల పెద్ద ఎత్తున చిట్టీల వ్యాపారం చేస్తూ అడ్డంగా బుక్కయ్యాడు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ ఫైనాన్స్ దందా నడిపిస్తున్న మ్యాథ్స్ టీచర్‌ను విద్యాశాఖ సస్పెండ్ చేసింది. వివరాల్లోకి వెళితే, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో కలువల ఎల్లయ్య అనే వ్యక్తి మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈయనగారు స్కూల్ టైమింగ్స్ దాటిన తర్వాత ప్రభుత్వ రూల్స్ కి పూర్తిగా విరుద్ధంగా ప్రైవేటుగా చిట్టీల వ్యాపారం నడిపిస్తున్నాడు. ఈ క్రమంలోనే చిట్టీల డబ్బుల విషయంలో పలువురిని మోసం చేశాడంటూ ఇటీవల ఎల్లయ్యపై బాధితులు ఫిర్యాదులు చేశారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఇలాంటి ప్రైవేట్ దందాలు చేయడంపై హనుమకొండ జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక ప్రత్యేక విచారణ కమిటీని రంగంలోకి దించారు. ఈ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో ఎల్లయ్య రూల్స్ బ్రేక్ చేసి చిట్టీల దందా నడిపినట్లు, మోసాలకు పాల్పడినట్లు ఆధారాలతో సహా నిజమని తేలింది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) గిరిరాజ్ సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## యోగా మతానికి లింక్ చేయవద్దు

**హైదరాబాద్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టతపై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని... దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. "ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప అమూల్యమైన కానుక యోగా. ఇది కేవలం వ్యాయామం కాదు.. మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం. మానవ చైతన్యానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఇదొక నిదర్శనం. మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిబ్బరాన్ని, ఆధ్యాత్మిక స్థైర్యాన్ని ఇచ్చే ఈ జీవన విధానాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ప్రకృతి ఒడిలో జీవిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ నిజం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. డిప్రెషన్ లాంటి సమస్యలను దూరం చేయడానికి యోగా అద్భుతంగా పనిచేస్తుందని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు

## ఇక వానలే వానలు

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చినా, అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురిశాయి.. అయితే, నేటి నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడనుందని, ఇరు రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వానలు కురుస్తాయి. తెలంగాణలో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సెంట్రల్, దక్షిణ తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ్ పేట్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుండి అర్ధరాత్రి సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో కూడా పగటిపూట ఎండ ఉన్నప్పటికీ.. రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే ముప్పు ఉందని వెదర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

## గురవారెడ్డిపై అట్రాసిటీ కేసు

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో వైద్యసర్కిల్‌లో ఊహించని ప్రకంపనలు మొదలయ్యాయి. ఎంతో గౌరప్రదమైన స్థానంలో ఉంటూ లక్షల మందికి సుపరిచితులైన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురువారెడ్డి చిక్కుల్లో పడ్డారు. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. తనను వేధిస్తున్నారని మరో వైద్యుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. జూబ్లీహిల్స్‌లో క్లినిక్ నడుపుతున్న డాక్టర్ సుధీర్ దారా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తన వృత్తిపరమైన ప్రతిష్టను దెబ్బతీసేలా, సమాజంలో తనకున్న గౌరవాన్ని భంగపరిచేలా డాక్టర్ సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారెడ్డి, ఆయన సహచరులు సోషల్ మీడియా వేదికగా నిర్వహించారని, ఈ క్యారెక్టర్ అస్సాసినేషన్ కేవలం ఇంటర్నెట్‌కే పరిమితం కాకుండా తన ప్రాణాలకే ముప్పుగా మారిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేయడానికి వచ్చారని వెల్లడించారు. డాక్టర్ సుధీర్ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36పరిధిలో క్లినిక్ నడుపుతున్న డాక్టర్ సుధీర్, గత కొంతకాలంగా ఆన్‌లైన్

# బీసీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

**- ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్**



**చేవెళ్ల జూన్ 20(ప్రజా జ్యోతి):** చేవెళ్ల బీసీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు అల్పాహారం సమయానికి అందకపోవడం, మౌలిక వసతుల లోపంపై భారత విద్యార్థి ఫెడరేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ నేతృత్వంలో హాస్టల్‌ను పరిశీలించిన బృందం విద్యార్థుల సమస్యలను తెలుసుకుంది. 15 రోజులుగా కేవలం ఒక్కసారి మాత్రమే హాస్టల్‌ను సందర్శించారని, ఉదయం 10 గంటలు దాటినా అల్పాహారం అందడం లేదని విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు గుర్తించారు. జూన్ నెలలో కొత్త అడ్మిషన్లు జరుగుతున్నప్పటికీ వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, లీకేజీలు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. సమస్యలు కొనసాగితే ఆందోళన చేపడతామని హెచ్చరించింది.

# ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

**గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా**

**బీజేపీ యువ నాయకుడు మహేష్ బాబు ముదిరాజ్ హామీ**



**మొయినాబాద్, జూన్ 20 (ప్రజా జ్యోతి):** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యెన్కెపల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు మహేష్ బాబు ముదిరాజ్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతరం పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. శనివారం గ్రామంలో పలువురు స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రధాన బాధ్యత అని అన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, పారిశుధ్యం వంటి ప్రాథమిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే నిజమైన సేవ అని పేర్కొన్న మహేష్ బాబు ముదిరాజ్, యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, ప్రజలతో కలిసి పనిచేస్తూ యెన్కెపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తనకు తెలియజేయాలని, వారి హక్కుల కోసం ఎప్పుడూ అండగా నిలుస్తానని ఆయన స్పష్టం చేశారు. స్థానికులు మహేష్ బాబు ముదిరాజ్ సేవా భావాన్ని అభినందిస్తూ గ్రామాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు.

# నిరుపేదల సొంతింటి కల నేరవేరుస్తున్న ఉప్పల ట్రస్ట్



**తలకొండపల్లి,జూన్20 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో నిర్మిస్తున్న పూర్తి ఇండ్లు,అసంపూర్తి ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండల కేంద్రం నిరుపేద కుటుంబానికి చెందిన పెరుమాండ్ల బాలమణి ఇంటి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిమెంట్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సహాయం పొందిన నిరుపేద కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్,ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్,వార్డు సభ్యులు పోతుగంటి కుమార్,నాయకులు వెంకటయ్య,దీప్ల తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పద్ధతులతో పంటల్లో మెరుగైన ఉత్పాదకత

**ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన**



**యాచారం, జూన్ 20 (ప్రజాజ్యోతి):** అన్నదాతలు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యవసాయ పద్ధతులను అవలంబించడంతో మెరుగైన ఉత్పాదకతను పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో శనివారం నల్లవెల్లిలో ప్రకృతి సేంద్రీయ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మొదట గ్రామంలో ఏఏ పంటలను ఏ విధంగా సాగు చేస్తున్నారో రైతులు, అభ్యుదయ రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడారు. పాడి పరిశ్రమ, కోళ్ళ పెంపకం, మిశ్రమ పంటలు, కూర గాయలు, పండ్ల తోటలో పెంపకంపై సేంద్రీయ వ్యవసాయ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గల వ్యవసాయ పద్ధతులను పాటించడంతో మెరుగైన లాభ సాటి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, శాస్త్రవేత్తలు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ మనోజ్ డాక్టర్ లతీఫ్ పాషా , రైతులు పాల్గొన్నారు.